వసంతకుసుమాకరము
మధుమేహము, రాజకురుపులు, జీర్ణ సుఖవ్యాధులకు అమృతము.
విదేశములయందు మా ఔషధము వాడబడి ప్రఖ్యాతి గాంచినది. 1 తు॥ రు 25/-
పూర్ణ చంద్రోదయము
క్షయ, శుక్లనష్టము, మేహ ఉడుకులకు, బంగారము కలసియున్నది. 1 తు॥ రు 20/-
శ్రీ కృష్ణ ఆయుర్వేద ఫార్మసీ,
ఏలూరు.

ఆంధ్రపత్రిక

The Andhra Patrika, Madras. } Regd. No. M. 1118 Vol. 35 No. 239 THURSDAY 2nd DECEMBER 1948 వెల ఒకఅణా { Founder: K. Nageswara Rao

ప్రభుత్వోద్యోగాలు : పరిషత్తు నిర్ణయం

4వ పేజీ

"ఉత్తమము, సంపన్నమూ, ప్రాచీనమూ అయిన మీ సాహిత్య సంస్కృతులను యావద్భారతానికీ ప్రకటించాలి"

విజయవాడ రేడియో కేంద్ర ప్రారంభోత్సవం జరుపుతూ సర్దార్ పటేల్ సందేశం

ఆంధ్రమహాజనులంతా ఈ నూతన కేంద్రంతో సహకరించగలరని ఉపప్రధాని విశ్వాసం

విజయవాడ, డిసెంబరు 1: "భారతదేశమునకు అంతటికి అతి ప్రాచీనము, ఉత్తమము అయిన సాహిత్యసంస్కృతులు గల రాష్ట్రములలో ఆంధ్రదేశము ఒకటని చెప్పవచ్చును. అతి పురాతనమూ, సంపన్నము అయిన కళాసంప్రదాయములు కల దేశము. సాహిత్య కళా సంపద అపారముగ నున్నది.

"అనేక విధముల కార్యక్రమముల ద్వారా తమ భాషలోని సంగీతమాధురిని, తమ సాహిత్య, సంస్కృతుల సత్సంప్రదాయములను ప్రకటించునట్లుగ, ఈ కొత్త రేడియో కేంద్రముతో ఆంధ్ర మహాజనులు యావన్మంది సహకరించెదరని విశ్వసిస్తున్నాను."

ఇచట స్థాపింపబడిన రేడియో కేంద్ర ప్రారంభోత్సవము జరుపుచు భారతఉపప్రధాని బ్రాడ్‌కాస్టింగ్ శాఖామాత్యుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఆంధ్రుల కిచ్చిన సందేశములో ఈ విధముగా తెలిపిరి: సర్దార్ పటేల్ విజయవాడకు రాజాలకపోయినందున్న ఢిల్లీనుండియే ఈ ప్రారంభోత్సవం జరిపిరి. నేటి సాయంత్రం సరిగ్గా 5-30 గంటలకు విజయవాడ రేడియోకేంద్రము పనిచేయ నారంభించెను.

సర్దార్ వల్లభాయి పటేల్ గారి సందేశము

ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రమునకు ప్రారంభోత్సవము జరుపడానికి నాకు బ్రహ్మానందముగా ఉన్నది. ఇండియాకంతకూ ప్రాచీన తమమూ, ఉత్తమమూ అయిన సాహిత్య సంస్కృతులు కల రాష్ట్రములలో ఆంధ్రదేశము ఒకటని చెప్పవచ్చు. అది పురాతనమయినూ, సార్థకమూ అయిన సంగీత కళా సంప్రదాయములు కల దేశము. సాహిత్య, కళాసంపద అపారముగనున్నది. కనుకనే ఈ దేశం ఇప్పుడు రేడియో ప్రసారంలో కూడా ప్రాముఖ్యం కోరడం ఎంతో సముచితంగా ఉంది.

అనేక విధముల కార్యక్రమముల ద్వారా తమ భాషలోని సంగీతమాధురిని తమ సాహిత్య సంస్కృతుల సత్సంప్రదాయములను ప్రకటించునట్లుగా ఆంధ్రమహాజనులంతా ఈ కొత్త స్టేషనుతో అన్ని విధములా సహకరిస్తారని నమ్ముతున్నాను.

నేను పదవీ స్వీకారము చేసిన ఒకటి రెండు సంవత్సరాలలోనే పనకబడి ఉండి అవసరముగా ఉన్న ప్రాంతాలకు చాలా మట్టుకు బ్రాడ్‌కాస్టింగ్ సౌకర్యాలు ఏర్పాటు చెయ్యకలిగి నందుకు నాకు ప్రత్యేకం ముదావహంగా ఉన్నది. గడచిన మాసాల్లో పాట్నా, కటక్, షిల్లాంగ్ గౌహతీలు, నాగపూరు, జల్లందర్ ఈ పట్నాలలో ఆల్ ఇండియా రేడియో కొత్త కేంద్రములను స్థాపించడమైనది. విజయవాడకూడ తగిన అగ్రస్థానమువహించగలదు.

ప్రస్తుతం ఈ నిలయం ప్రసారం కొంతవరకు తాత్కాలికంగా దుర్బలంగా ఉండేమాట వాస్తవమే కాని, ఈ లోపములెలాగా ఉన్నప్పటికి ఈప్రసారాన్ని వినే భాషాప్రాంతమందంతటా కూడా దీనికి సంతోషించనివారుండరు. ఇటువంటి స్టేషన్ల నిర్మాణములో ఎదుర్కొనే ముఖ్య సమస్య ఏమంటే, మంచి కట్టడములు, యంత్ర సామగ్రి దొరికేవరకు స్టేషనులను స్థాపించడమే మానుకోవడమా లేక, తాత్కాలికంగా వీలైనంతనుట్టుకు చిన్నయెత్తులోనే యేర్పాటుచేసి, కొంతవరకు పరిశోధనలు చేసి, ఆ తరువాత సమగ్రమైన బ్రాడ్‌కాస్టింగ్ స్టేషనుగా అభివృద్ధి పరచడమా అని. ఈ రెండిటిలోను మేము అవలంబించిన మార్గమే సరియైనదనీ, ఆంధ్రదేశము మమ్మల్ని అందుకు తప్పక అభినందించగలదనీ నా విశ్వాసము.

విజ్ఞాన ప్రదాయకమూ వినోదదాయకమూ అయిన సాధనములు మీకు అర్పించుకొన్నాము. దీని భవిష్యత్తు మంచి చెడ్డ

(3-వ పేజీ చూడుడు)

కర్నాటక సంగీతము, త్యాగరాజు కీర్తనలలో మధురమైన ఆనందం పొందువారందరికీ పండుగదినం

విజయవాడ రేడియో కేంద్రం: రాష్ట్రప్రధాని శుభాకాంక్షలు



చెన్నరాష్ట్ర ప్రధాని శ్రీటంమందూరు పెదరామస్వామిరెడ్డిగారు విజయవాడ రేడియో కేంద్రం ప్రారంభోత్సవ సమయమున ఈ విధంగా సందేశం ఇచ్చారు:

విజయవాడ క్రొత్తరేడియో స్టేషను నేడు తన కార్యక్రమమును ప్రారంభించుచున్నది. తెలుగువారి చిరకాలవాంఛ నేటికి ఈడేరినది. ఈ శుభసమయమున నా తెలుగు మిత్రులతోపాటు నేనుకూడఎంతో ఆనందపడుచున్నాను.

ఇది నిజముగా శుభసమయము. చరిత్రాత్మకమైన శుభసమయము. నేటిఆనందం ఒక్క మాడుకోట్ల తెలుగువారికిమాత్రమే కాదు. కర్ణాటక సంగీతములోను, త్యాగయ్యకీర్తనలలోను మధురమైన ఆనందమును పొందు ప్రతివారికిని నేడు ఒక గొప్ప పండుగరోజే అనవచ్చును.

ఈ విజయవాడ రేడియో స్టేషనుకు రెండు మంచి సౌకర్యములు గలవు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని కృష్ణదేవరాయలవారు అనుటయే కాక, ప్రపంచములోని మధురమైన భాషలలో తెలుగు భాష ఒకటి యని అందరు గుర్తించిన విషయమే. తెలుగు చక్కని సంగీతపు భాష. ఈ స్టేషనుకు ఇదొక విశిష్టత. రెండవది శ్రీ త్యాగరాజ స్వామివారి అనంతమైన సంగీతసాహిత్యము. ఆ సంగీత రత్నాకరమునుండి యెంచి వెలలేని ఆనంద భాగ్యమును ఈస్టేషను ప్రపంచమునకు పంచి యివ్వగలదు. కాగా, ఆంధ్రదేశమునకు దూరములో నుండు వారుగూడ, వారికి తెలుగు అర్థమైనను-కాకపోయినను-విజయవాడ సంగీత కార్యక్రమమునకు చెవికోసుకొనగలరు. మంచి సంగీతము ఎన్నటికి వెగటు గలిగించదు. కనుక విజయవాడ రేడియోస్టేషనుకు గొప్ప భవిష్యత్తు కలదని విశ్వసించుచున్నాను.

అయితే, రేడియో ఒక్క సంగీతమును ప్రసారము చేయుటకు మాత్రమే కాదు. దాని ఉపయోగములు ఇంకను చాలగలవు. సంఘములో సమత్వమును నెలకొల్పుటకు నేడు రేడియో ఒక ముఖ్యసాధనము. విజ్ఞానవంతమైన సాంఘిక జానపద కార్యక్రమముల ద్వారా ప్రజలలో ప్రజాస్వామిక సిద్ధాంతములను ఇది ప్రచారము చేయుచున్నది. ముప్పదియేండ్ల క్రితమువరకు ఎవరో కొద్దిమందికి అనుభవయోగ్యముగా వున్న కళలను రేడియో నేడు ప్రజలందరి అందుబాటులోనికి తెచ్చినది. ప్రజలను విద్యావంతులుగా చేయుటలో ముద్రణ కంటెను రేడియో ఎక్కువ ఉపయోగకరమనుట సర్వజన విదితము.

రేడియో ఒక మహత్తర శక్తిమంతమైన ఆయుధము. దానిని ఉపయోగించువారిలో నైతిక వైజ్ఞానిక సేవా బలము అనంతరముగ కావలసి యున్నది. అప్పుడే అది అమూల్యఫలదాయిని కాగలదు.

వైజ్ఞానిక పరిశోధనలను చక్కని జాన

(3-వ పేజీ చూడుడు)

రాజెన్‌బాబు ఇక వార్ధాలోనే ఉండిపోతాడట

కాశీ, నవంబరు 30: ఆరోగ్యమును కోలుకొనే నిమిత్తం వార్ధాలో విశ్రాంతి తీసుకొనుచున్న బాబూ రాజేంద్రప్రసాద్ మొదట అనుకొన్నట్లు 3 నెలల పాటేగాక యావజ్జీవితమూ అక్కడేఉండి, మహాత్మాగాంధీ అసంపూర్ణంగా వదలివైచిన కార్యభారమును నిర్వహింపదలచుచున్నాడని ఆయన సన్నిహితులలో నొకరివలన తెలియుచున్నది. (యు. ప్రె.)

జపానుయుద్ధనేరస్థుల ఉరిశిక్షల వాయిదా

టోకియో, నవంబరు 30: టోకియో ఆక్రమణ సర్వసేనాని, జనరల్ మాక్ ఆర్థర్ యుద్ధనేరస్థులుగా ఉరిశిక్ష విధింపబడిన జపాను ఆఫీసరుల శిక్షలు తాత్కాలికముగా నిలిపి వేసినాడు.

ఇందు కెంజీడావ్ హెయిరా, కోకీ హిరోటా అను ఇరువురు నేరస్థులు తమశిక్షలను రద్దుచేయించ వలసి నదిగా అమెరికా సుప్రీము కోర్టుకు వినతి పంపుకొన్నారు. సుప్రీము కోర్టువారినిర్ణయము తెలుపకనూ ఈ శిక్షలు నిలుపుచేయబడునా యని అడుగగా మాక్‌ఆర్థర్ 'కాదు' అని సమాధానము చెప్పిరి.

కాశ్మీరు యుద్ధరంగం

న్యూఢిల్లీ, నవంబరు 30: పదాబాదు పూంఛ్‌గరు ప్రాంతములలోనూ, పేంథర్రు పూంఛ్ మధ్యప్రాంతములలోనూ నేడుశత్రు చర్యలు ప్రకోపించినవి. 150 మందికిపైగా శత్రుసైనికులు మనఫిరంగులకు గురియై అందులో 20 మంది మరణించిరి. ఇతర ప్రాంతముల విషేషమైన యుద్ధములేదు. మన యుద్ధవిమానములుకూడా పనిచేసినవి.

ఇండొనీషియాచర్చల్లో తిరిగి ప్రతిష్టంభన

చర్చలు ఆపివేయవలెనని డా॥ హట్టాకు సూచన

బటేవియా, నవంబరు 30: డచ్చినుంత్రివర్గ రాయబారులతో 3 రోజులనుండి జరుపుచున్న చర్చలను విరమించవలెనని ఇండొనీషియా రిపబ్లికన్ నాయకులు తమప్రధాన మంత్రి డా॥ మహమ్మద్ హట్టాను కోరినారని అంతరా వార్తాసంస్థ తెలుపుచున్నది. ఇందువలన బహుశా ప్రతిష్టంభన ఏర్పడియుండునని కొంద రూహించుచున్నారు.

భద్రలామండలివారి సామరస్యసంఘం ద్వారా డచ్చివారితో తిరిగి సంప్రదింపులను ప్రారంభింపవలెననికూడ వారుకోరిరట.

ఇండొనీషియన్ విప్లవకారుల మిలిటరీ అధిపతికల్నల్ దర్మో సుజోనో, మరి 6 గురు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు గత ఆదివారంనాడు రిపబ్లికన్ సేనల చేజిక్కిరని తెలియుచున్నది.

తూర్పు సుమత్రాలోని ఇంద్రగిరి రాష్ట్రంలో రిపబ్లికనుల వశమందున్న రెంగాలో కేంద్రమునకు సింగపూరుకు మధ్య పరట్టాడ-వ్యాపారము జరుగుటకు డిసెంబరు 1 నుండి అనుమతింపబడునని డచ్చి నావికాధికారులు నేడు ప్రకటించిరి.

నూతనముగా స్థాపింపబడిన తూర్పు జావారాష్ట్రి తాత్కాలిక శాసనసభ నేడు బాండోవాసో నగరంలో ప్రమాణ స్వీకారమును చేసెను. డచ్చి ఆక్రమణక్రింద నున్న 13 ప్రాంతములు తూర్పు జావారాష్ట్రంగా ఏర్పడవలెనని ఈ మాసారంభములో తీర్మానింపబడినది.

చర్చల సమాప్తి

బటేవియా, డిసెంబరు 1: ఇండొనీషియన్ రిపబ్లిక్ ప్రధాని డా॥ హట్టాకును, డచ్చి మంత్రివర్గ రాయబారులకును జోగ్జకర్తాలో 3 రోజులుగా జరుగుచున్న చర్చలు నిన్నటితో సమాప్తమైనవని, డచ్చి రాయబారులు స్వదేశమునకు తిరిగి వెళ్లిపోవుచున్నారని గతరాత్రి "అంతరా" వార్తాసంస్థ ప్రకటించినది.

"ప్రభుత్వంతో సహకరించుటే ప్రస్తుతం పారిశ్రామికుల విధి"

గవర్నర్ జనరల్ శ్రీరాజగోపాలాచారి ఉద్బోధ

కలకత్తా, నవంబరు 30: 'ప్రజాస్వామికము, సహజముగా, దండవిధానము కలది. ఈ పరమార్థము నంగీకరించి, దాని స్వభావమునకు అనుగుణమగు రీతిని పారిశ్రామికులు వ్యాపారస్తులూ నడచుకొనుట పరమ ధర్మమైయున్నది. ఆగస్టు 15వ తేదీ వరకూ, అధికారమూ, నిరంకుశత్వమూ ఈ దేశమున రాజ్యముచేసినవి. విదేశముల బల సహాయములతో ప్రజలను అణచుచూ వచ్చిన ప్రభుత్వము గనుక మీకు వీలగు రీతిని, అచంచలమైన స్థాయిగల విధానములను కానింపగలిగినది. ప్రజల చెప్పుచేతలలో నడువవలసిన బాధ్యత దానికిలేదు గనుక దాని యాటలు సాగివచ్చినవి. ఆగస్టు 15 తో అట్టిప్రభుత్వము అంతరించినది. నేడున్న ప్రభుత్వము అట్టిదికాదు. ఇది ప్రజాస్వామికము. ప్రజల నుండి అధికారముపొందవలసియున్నది. విధానములుమారుచేగాదు, ఒక్క అవిశ్వాసతీర్మానముతో ప్రభుత్వమే తలక్రిందులై క్రొత్తప్రభుత్వ మేర్పడవచ్చును. ప్రజాస్వామికమనగా ప్రవాహమువంటిది. కదలికలేని చిన్నతటాకముగాదు. పారుతున్ననీటితోపాటు మన పడవహాయిగా పయనించవలసియున్నది." అని గవర్నర్‌జనరలు శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారు బెంగాల్ వాణిజ్యమండలి సమావేశమునందు ప్రసంగించుచూ, పారిశ్రామికులనూ, వాణిజ్యవేత్తలను హెచ్చరించిరి.

ప్రజాస్వామిక వాహినిలో పెలగుట బ్రిటిష్‌వారికి బాగుగా తెలియును. సంతోషముతో వారు ఈ పరిణామములను శిరసావహించుచున్నారు. ఈదేశముపట్ల, స్వజాతీయులపట్లా, ఆ విజాతీయులకున్న విశ్వాసము మీకు లేకుండుట విచారకరము. వారిని చూచియైన మీరు మనోధైర్యమును వహించి కార్యరంగమున కురుకవలయును. బ్రిటిష్ ప్రభుత్వము తిరిగి రాగలదనిగాని, ఆ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఈప్రభుత్వ మీయగలదనిగాని తలపోయరాదు. ఈపరిణామ పరిస్థితులతో మనము పొత్తు కుదుర్చుకొని 'తృప్తోస్మి' యను కొనవలసి యున్నది.

"జకోస్లోవేకియావారివంక చూడుడు. వారు రెండు రాజకీయ విధానముల మధ్య నలిబిలియగుచున్నారు. కాని వారు మీకు వలే అధైర్యమునందుటలేదు. వారికి ఆశ్మ విశ్వాసము, కార్యదీక్ష ఉన్నవి. మన కవియే మృగ్యముగా నున్నవి.

"ప్రభుత్వ విధానములకు స్థాయీభావములేదని మీరు సర్వదా సణుగుచున్నారు. దాని కెవ్వరునూ యేమియూ చేయజాలరు. ప్రజాస్వామికమనగా, దాని స్వభావమే అట్టిది. వీని నన్నిటినీ వ్యక్తులలోపములుగా మీరు భ్రమపడరాదు. పరిస్థితి నవగతము చేసుకొని పొత్తు కుదుర్చుకొని నడచుటకు అలవాటు పడవలసి యున్నది. పన్ను లెక్కువగు చున్నవని మీరు పదే పదే అనుచున్నారు. ఏకల్లోలములు రాకుండ బాధ్యత మాత్రము ప్రభుత్వము పైవేసి దాని ఖర్చులు మాత్రము తగ్గించుకొనుచున్నారు. ఇది సాధ్యపడుటయెట్లు?- అట్టి కోరికలు కోరుట ప్రయోజన రహితము. మావత్తకము, పరిశ్రమను స్వేచ్ఛగా వదలి, కార్మికకల్లోలము వచ్చిన చోటికి మాత్రము మీ పోలీసులను పంపుడు, అనుచున్నారు. మరివారి జీతముల సంగతి యెవరు చూచెదరు. వాస్తవముగా మీరు, మీ పరిశ్రమలను స్వతంత్రముగా నుంచుకొనుహక్కుమీకు కావలయునని కోరుచున్నచో కార్మికుని తృప్తి పరచు బాధ్యతను కూడ మీరు పైన వేసుకొన వలసియున్నది. మీ వ్యాపారము సరిగా లేదని మీరే అల్లరచేసుకొనుట మీకేనష్టము. మీ పెట్టుబడుల విలువలూ, మీ సరకుల విలువలు పడిపోగలవు - తెలివిగల యేవ్యాపారస్తుడూ ఇది చేయ దగిన పనిగాదు. ఉన్న పరిస్థితులు మనము ప్రజలకు నచ్చు చెప్పవలసి యున్నది. అప్పుడు గాని కార్మికులు

4 వ పేజీ చూడుడు

మిల్లుబట్టపై కంట్రోల్

ధరల స్థిరీకరణకు భారతప్రభుత్వ కృషి

చెన్నరాష్ట్రంలో వస్త్రరేషనింగ్ ఉండదు

న్యూఢిల్లీ, నవంబరు 30: మిల్లుబట్టల ఉత్పత్తి కంట్రోలు, భారతదేశమందంతట రేపు అమలులోనికివచ్చును. దానితోబాటు కొన్ని రాష్ట్రములవారు మిల్లుబట్టల రేషనింగు ప్రవేశపెట్టుచున్నారు. సామాన్యులకు సరసమైన ధరకు తగినంత బట్ట లభించుటకుగాను వారు ఈ రేషనింగు ప్రవేశపెట్టుచున్నారు.

ఈ కంట్రోలు చర్యలు మిల్లుబట్టల ఉత్పత్తికి, వానిధరలను నియమించుటకు సంబంధించియున్నవి. పంపకమును వివిధరాష్ట్రములవారు తమయిష్టమువచ్చినట్లు చేసికొనవచ్చును. ముద్రలేని బట్టల అమ్మకము నిషేధింపబడుచున్నది.

మిల్లుధరలకు 100 కి 20 వంతులు మించకుండా చిల్లరధరలు నిర్ణయింప వలసినదిగా రాష్ట్రములకు ఉత్తరువులు జారీయైనవి.

రేషనింగు

మ॥ రా॥ ములు, బొంబాయి, ఢిల్లీ వంటి కొన్ని రాష్ట్రములు రేపు మిల్లుబట్టల రేషనింగు ప్రవేశపెట్ట నిర్ణయించినవి. మద్రాసువంటి మరికొన్ని రాష్ట్రములు కొనుగోళ్లపై కంట్రోలు విధింపవు. వివిధ రాష్ట్రములు స్థానికపరిస్థితుల ననుసరించి పంపకపు విధానమును నిర్ణయించును. ఢిల్లీలో 15 రోజులపాటు ఇన్‌ఫార్మల్ రేషనింగు అమలుచేసి, తరువాత శాసనపూర్వకమగు రేషనింగు అమలుచేసెదరు. సం॥ రా॥ ములు, మ॥ రా॥ ములవంటి కొన్నిరాష్ట్రములు కొంతమగుకును పరపతి సంఘములద్వారా పంపకముచేయించ నిశ్చయించినవి. మద్రాసులో చేనుగ్గములపై తయారైనబట్ట విస్తారముగా నుండుటచేత మిల్లుబట్టలపై విస్తారముగా ఎగబడరు. ఈ కారణముచేత మద్రాసు ప్రభుత్వంవారు

[2 పేజీ చూడుడు]



విజయవాడ రేడియో స్టేషన్‌ను ఎట్టకేలకు నేటినుండి మీరు 357.1 మీటర్లమీద (840 kc/s) వినగలరు. మీ కిష్టమైన ప్రోగ్రాంలను అద్భుతమైన భారతదేశపు రెల్ రేడియో మీద వింటూంటే మీ ఒళ్లు పులకరించదా? రెల్ రేడియో 'ఫిలిప్సు' (హాలండు) భాగములతో కుటుంబప్రవణానికి ఆదర్శప్రాయమైన సెట్టుగా ఉండేట్లు అనేక విశేషాంశాలు చేర్చి అమర్చబడినవి.

తక్షణమే ఆర్డరివ్వండి
రేడియో అండ్ ఎలెక్ట్రికల్స్, లిమిటెడ్,
1/29-బి, హాంటర్ రోడ్డు, మద్రాసు 2.

అన్నిముఖ్యకేంద్రములలో
నూతన రేడియో
పూర్తారీతిన

ప్రకటన

విశాఖపట్టణములో మా ఆంధ్ర దైనిక, సచిత్రవార, భారతి మాసపత్రికలు వారి స్వంతబాధ్యతపై విక్రయించుటకు, శ్రీ జి. బ్రహ్మజీగారిస్థానే, శ్రీ సి. కి. రమణమూర్తిగారిని డి 31-11-48 నుండి నియమించడమైనది.

మే నే జ రు.

గంటల పంచాంగం

సర్వధారినం॥ మార్గశీర్ష శు॥ ద్వితీయ
1948 నం॥ డిసెంబరు 2 గురువారం
సు॥ద్వితీయ రా 10-57మూల రా2-37వర్జ్యం
రా 12-59 ల 2-37 కు.
శు॥తృతీయడిసెంబరు 3 శుక్రవారం
సు॥తృతీయ రా11-12పూస రా3-31వర్జ్యం
ప 12-34 ల2-14 కు.

ఆంధ్రపత్రిక

సర్వధారినం॥ మార్గశీర్ష శు॥ ద్వితీయ
గురువారం

ఐక్యభావ మవసరము

పదునాలుగు మాసములు ప్రజా పోరాటమును నడపి, విజయమును సాధించి, భవిష్యత్ కార్యక్రమ నిర్ణయమునకు, అ. హై. సంస్థాన కాంగ్రెసు సమావేశము ప్రప్రథమముగా సమావేశమైనది. గత మాసమునందే సంస్థాన కాంగ్రెసు కార్యవర్గము ముందు కార్యక్రమమునుగురించి కొన్ని తీర్మానములను చేసియుండెను. ఆ తీర్మానములను సర్వసభ్య సమావేశము విశేష సవరణలు లేకనే ఆమోదించవచ్చును.

ప్రజా పోరాటము జయప్రదముగ ముగిసి, సంస్థానమునందు నూతనాధ్యాయము ప్రారంభమగానున్న సమయమున, సంస్థాన కాంగ్రెసునందు పొరుపులుబయలుదేరుట విషాదకరమైన విషయము. వాస్తవమునకు పూర్వముకన్న భవిష్యత్తునందే సంస్థానకాంగ్రెసు ఎక్కువ మహాత్కార్యములను సాధించవలసి యున్నది. సంస్థాన ప్రజను సంఘటితపరచి ఏక మార్గమున నడిపించ గలిగినది సంస్థాన కాంగ్రెసుతప్ప మరొక పక్షము లేదు. అట్టి సందర్భములో, సంస్థాన కాంగ్రెసునందలి అన్ని వర్గములను సమైక్య పరచవలసిన అవసరము మరింత ఏర్పడుచున్నది.

తీర్థ చెప్పినట్లు ప్రస్తుతము కావలసినది సంస్థాన కాంగ్రెసు ఐక్యత చెక్కు చెదరకుండ ఉండునట్లు చూచుట అన్నిటి కన్నా ముఖ్యము. ఈ శిక్షణ చర్యలన్నట్టిది సాధింపబడునా అనునదే ఆలోచనీయము. శిక్షణ చర్యకు లోనైనవారు పోరాటములో నిర్లక్ష్యతపద్ధతుల ననుసరించి పాల్గొని యుండక పోవచ్చును. అందుకు వారినెవరినీ హర్షింపరు. అయితే ఈ సమయములో వారిని త్రోసివేసిన ఐక్యతకు ఉపకరింపక, ప్రత్యేక వర్గములు ఏర్పడుటకు ఉపకరించును. దానివల్ల కలుగు దుష్ఫలితములనుగురించి వేరే చెప్ప నవసరము లేదు. అన్ని రాష్ట్రములందు ఆ ఫలితములు నిత్యము కనుపడుచునే యున్నవి. కాబట్టి ఈ అంశమును సంస్థాన కాంగ్రెసు అగ్రనాయకులు గమనించెదరని ఆశించుచున్నాము. కాంగ్రెసు వాదులందరి ఐక్యత చెడకూడదను భావముతోనే ఈ సూచన చేయబడినది కాని వేరు ఉద్దేశముతో కాదు. అంతేగాక గతమును విస్మరించి వ్యవహరించవలసిన పరిస్థితులుకూడ ఇపుడేర్పడినవి. భారత దేశమునందు కాంగ్రెసు అవలంబించిన విధానమునుబట్టి ఇది గోచరము కాగలదు. కాంగ్రెసు తానుసాగించిన స్వాతంత్ర్యపోరాటమునందుపాల్గొననివారినేగాక, అందుకు విముఖులైనవారినికూడ ప్రభుత్వ రంగమునందు దగ్గరకు తీసినది.

ముందు సాధించవలసిన కార్యములగురించి రామానంద తీర్థగారు తమ ఉపన్యాసమునందు ముచ్చటించిరి. సంస్థానములో కొన్నిజిల్లాలందు కమ్యూనిస్టుల ఉపద్రవము ఎక్కువగా నున్నదనియూ దాని నెదుర్కొనుటకు మార్గముల అన్వేషించవలెననియు చెప్పిరి. ఆయన కే హత్యాప్రమాదము తప్పినది. నల్లగొండ జిల్లాయందు, ప్రభుత్వమనునది లేదని, కమ్యూనిస్టులు కేవలము దౌర్జన్యముతో తమ ఆధిపత్యమును సాగించుచున్నారని దినమూ వచ్చు వార్తలు తెలుపుచున్నవి. రజాకర్ల అనంతరము వీరి ప్రమాదమే ఎక్కువగ నున్నది. ప్రభుత్వముతోపాటు వీరిని ఎదుర్కొన కలిగినది కాంగ్రెసుతప్ప మరొక పక్షము లేదు. అట్టి సందర్భములో, సంస్థాన కాంగ్రెసునందలి అన్ని వర్గములను సమైక్య పరచవలసిన అవసరము మరింత ఏర్పడుచున్నది.

అసియాదూరప్రాచ్యం ఆర్థిక సంఘం

ఇండోనీసియా సభ్యత్వం విషయమై తీవ్ర చర్చ

రాన్‌స్టన్ (ఆస్ట్రేలియా) నవంబరు 31: ఇండోనీషియాను, ఫిలిప్పైన్సు ఆసియా దూర ప్రాచ్య ఆర్థిక సంఘములో ఓటింగు లేని సభ్యులుగా చేర్చుకొను విషయమై నేడు సంఘ కార్యకలాపములో ప్రతిష్టంభన ఏర్పడినది.

స్వతంత్ర దేశమగు నేపాలుకు ఓటింగు లేని సభ్యత్వ మివ్వబడినది.

ఇండోనీషియా రిపబ్లిక్‌ను సంఘ సభ్యులైన కొన్ని ప్రభుత్వములు గుర్తించనవనీ, ఇప్పుడు కూడ ఆ రిపబ్లిక్ వ్యాపార కమీషనర్ ఒకడు ఆస్ట్రేలియాలో ఉన్నాడనీ, రిపబ్లిక్ దరఖాస్తును వాయిదా వేయక తప్పనిచో ప్రస్తుత సమావేశము ముగియక ముందే ఆవాయిదా అయిపోవునట్లు చూడవలెనని భారత ప్రతినిధి సి. సి. దేశాయ్ వాదించెను.

రష్యా ప్రతినిధి సమర్థన

రిపబ్లిక్ దరఖాస్తును వాయిదా వేయుట వలన ఎడతెగని విషమ చక్రమేర్పడునని, ఏళ్లకాలదిగా స్వాతంత్రోద్యమం సాగించి 7 కోట్లమంది ప్రజలదరఖాస్తునునిర్లక్ష్యం చేయుటకు వీలులేదనీ కనుక వెంటనే రిపబ్లిక్ సభ్యత్వపు సమస్యను పరిష్కరింపవలెననీ, రష్యన్ ప్రతినిధి లిఫానోవ్ ఉద్ఘాటించెను.

ఇండోనీషియా దరఖాస్తును వాయిదా వేయుటకు వీలులేదని, ప్రస్తుత సమావేశపర్చలలో పాల్గొనే అధికారము ఇండోనీషియా కున్నదనీ బర్మీస్ ప్రతినిధికూడ వాదించెను.

ఈ విషయము చేపటి:రకూ వాయిదా వేయబడినది.

జపానీస్ ఆర్థిక విషయములను గూర్చి నిర్ణయించుటకే సంఘమున కధికారములేదని, అది దూరప్రాచ్య కమీషనదనీ రష్యా ప్రతినిధి లిఫానోవ్ పెట్టిన అభ్యంతరమును సంఘమువారు మెజారిటీ వోట్లతో త్రోసివేసిరి.

అగ్రరాజ్యాల సామరస్యం

భారతప్రతినిధి విజ్ఞప్తి

పారిస్, నవంబరు 30: అగ్రరాజ పంచకమునందు వీటో సమస్యపై చెలరేగిన సంఘర్షణను అరికట్టుటకుగాను భారత ప్రతినిధి నేడొక విజ్ఞప్తిని చేసియున్నాడు: బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, చైనా, ఈ నాలుగు రాజ్యములును కలిసి, రష్యా వీటో అధికారమును అరికట్టుటకు భద్రతా సమితియందు తీవ్రముగా పోరాడుచున్నవి. అటు రష్యా ఇటు ఈ నాలుగు రాజ్యములూ తీవ్రముగా సంఘర్షణ పడుచున్నవి. ఈ సంఘర్షణను శాంతింపజేయుటకు భారత ప్రతినిధి, బి. శివరావుగారు పోటా రాజకీయ సమావేశమునందు ఈ క్రింది విజ్ఞప్తిని చేసియున్నారు.

'ఈ భద్రతా సమితి శాంతిరక్షణకొరకు యేర్పడిన సంస్థ. దాని కార్యక్రమమంతయూ న్యాయమైన శాంతిమార్గమున పరిష్కరింపబడవలయును. భద్రతా సమితి కార్యక్రమ విజయమంతే అగ్రరాజ్యముల పరస్పర సామరస్యముపై ఆధారపడియున్నది. నేడది యిచ్చట మందునకైననూ కానరాకున్నది. దయవుంచి అందరూ శాంతి సానుభూతులు వహింపవలెనని కోరుచున్నాను. ఇట్టి ప్రాథమిక సామరస్యము కుదురువరకూ అగ్రరాజ్య సమితి ప్రధాన సూత్రములకే ప్రతిబంధకముగా కనుపించుచున్న ఈ తీర్మానమును చిన్న చిన్న సంయుక్త సంభాషణల ద్వారా పరిష్కరించుకొనుటకు ప్రయత్నించవలయును. ఇంతకు భిన్నముగా పరస్పరము పోరాడుకొని ప్రయోజనములేదు. ఇపుడు మనము ఐక్యరాజ్య సమితి ప్రధాన సూత్రముల మార్చుటకు ప్రయత్నించరాదు. ఒక వేళ అట్లు మార్చవలెనంటే, నిబంధన తరువాత నిబంధన అన్నియూ మారవలెను. అట్టిది జరుగుట కవకాశమున్నదేని భారతదేశము తప్పక సహకరించగలదు.

రష్యా ప్రతినిధి విషిన్‌స్కీ ఇట్లు పోరాడినాడు:

ఇది యంతయూ ఒక కుట్ర; బ్రిటన్ అమెరికాలు ఐక్యరాజ్య సమితి నిబంధనలను త్రెంచివేయుటకు పన్నాగము. శాన్‌ఫ్రాన్సిస్కో ఒడంబడికకు బ్రిటన్ అమెరికాలు కట్టుబడియుండవలసిన బాధ్యత యున్నది. ఆసలీచోటా రాజకీయ సభ అశాస్త్రీయమైనది. అన్యాయమైన కుబుద్ధితో ప్రవర్తించు అధిక సంఖ్యాక వర్గముయొక్క నిర్ణయములనుండి కాపాడబడుటకు అది అత్యవసరము. రష్యా వీటోను వదలుకొనజాలదు. ఐక్యరాజ్య సమితి నిబంధనల మార్చవలచిన, మహాసభ సమావేశము నేర్పాటుచేసి అట్లు చేయవచ్చు. కాని మీరందుకు సిద్ధముగాలేరు. అట్టిది మీరు వాంఛించినేని, ఐక్యరాజ్య సమితి సభ్యులందరకునూ, భద్రతా సమితి సభ్యులందరికినీ అంగీకారమనుకొనిన నేను తీర్మానము తేగలను.

వీటోను సమర్థించుచు సోవియట్ ప్రతినిధి విషిన్‌స్కీ, రెండుమూడు దేశములు మిగిలిన దేశములమీద కుట్ర పన్నకుండా నిరోధించుటకు వీటో ఏర్పరచబడినదనియు, అధిక సంఖ్యాకులనుంచి అది అల్పసంఖ్యాకులను రక్షించుచున్నదనియు, వీటోపై దురభిప్రాయము గలుగుటకు అతి హేయమైన ప్రచారము జరిగినదనియు, ఐక్యరాజ్య ప్రణాళికను భగ్నముచేయుటకే పశ్చిమ రాజ్యముల వారు వీటో ప్రయోగమును నిగ్రహించుటకు యత్నించుచున్నారనియు, సోవియటు యూనియను తన ప్రమాణముల నెన్నటికి ఉపసంహరించదనియు, తాత్కాలిక (చిన్న సమితి) నియామకము న్యాయబాహ్యమనియు, ఐక్యరాజ్య సమితి సభ్యులకు, ప్రత్యేకించి భద్రతామండలివారికి, అభిప్రాయములు కుదురుటకు గాను తాను ఒకసవరణను తయారుచేయుచున్నాననియు ఐక్యరాజ్య ప్రణాళికను మార్చవలెనన్న ఒక సమావేశమును జరుపవచ్చుననియు చెప్పెను.

న్యూజిలాండు ప్రధాని, పీటర్ ఫ్రేజర్, భద్రతామండలి భద్రత చేకూర్చలేనిదై, విషపూరితమైన వాగ్వాదములకు నిలయమైనదనియు, ఐక్యరాజ్య ప్రణాళికపై సమావేశము జరుగుట మంచిదనియు చెప్పెను.

బట్టలకంట్రోల్

1 వ పేజీ తరువాయి

బహిరంగ పంపకవిధానమును అవలంబింపనిశ్చయించి.

కంట్రోలుచర్యల స్వరూప స్వభావములు

ఉత్పత్తి హెచ్చించుటకు, రకములను నియమించుటకు వివిధచర్యలు గైకొనగ ప్రభుత్వమువారు నిశ్చయించిరి. మిల్లులు ఉత్పత్తిచేయదగిన నంబర్లపై హద్దు లేర్పరుపబడినవి. 80 నెంబరు బట్టకంటె సన్న బట్ట మిల్లులు ఉత్పత్తి చేయరాదు. అన్నిబోట్ల ఉత్పత్తి ఒకేవిధముగా నుండుటకును, ఉత్పత్తిని హెచ్చించుటకును ఈ చర్యలు గైకొనబడినవి. టివ్వెల్సు, కోటింగు, భారమైన దుస్తుల ఉత్పత్తికి ఏమిట్లా తమ మగ్గములలో 100 కి 10 వంతు కంటె హెచ్చు మగ్గములను వినియోగింపరాదు. రెండవది, బట్టలను తయారుచేయుటలో ఉపయోగించదగిన పేకనూలు, పడుగునూలును మార్చుటపై హద్దు యేర్పరుపబడును. బట్ట మన్నికగలదిగా నుండుటకును, మిల్లులవారు పడుగుకుచాలా సన్ననంబర్లు, పేక చాలా ముతక నంబర్లు ఉపయోగించి అబట్ట నాణెమునకు తగిన భరకంటె హెచ్చుధర పొందకుండా చేయుటకును ప్రభుత్వమువారు పడుకు పేక నూళ్ళరకమును మార్చుటపై హద్దు పెట్టియున్నారు.

వివిధ రాష్ట్రములవారు ఉత్పత్తి కంట్రోలును అమలు చేయుటను సమన్వయం చేయుటకుగాను ఇండియా ప్రభుత్వమువారు ఒక డైరెక్టరేటును యేర్పరిచి యున్నారు. కేంద్రప్రభుత్వం కంట్రోలును అమలు చేయవలసిన యెడల గొప్ప పరిపాలనా యంత్రమును వారు స్థాపింపవలసి యుండును. ఈ కారణముచేత వారు ఈ పనిని ప్రాంతీయాధికారులకు వదలియున్నారు.

నిల్వలు సంతృప్తికరముగానున్నవి

దేశములో ప్రస్తుతము నిల్వల పరిస్థితి సంతృప్తికరముగా నున్నదని చెప్పుచున్నారు. ఇప్పుడు దేశములో 5 లక్షల బేళ్లబట్ట నిల్వయున్నదని అంచానావేయబడుచున్నది. మిల్లులవారివద్ద దాదాపు 5 వారములకు సరిపోవుబట్ట, అనగా 2 లక్షల 25 వేల బేళ్ళు వున్నవి. మిల్లులు బాగానే ఉత్పత్తి చేయుచున్నవి. గత మాసము బొంబాయి, అహమ్మదాబాదుమిల్లులు ఒక లక్ష 50 వేల బేళ్ళు ఉత్పత్తి చేసెను. ఉత్పత్తి హెచ్చుటవల్లను, పాకిస్తాను తిక్కు నబట్ట పుచ్చుకొనుటవల్లను, బట్టల ఎగుమతి తగ్గుటవల్లను దేశములో బట్టల నిల్వ పరిస్థితి సంతృప్తికరముగా నున్నదని ఇండియా ప్రభుత్వ ప్రతినిధియొకడు చెప్పెను. ముందు కూడ పరిస్థితులు ఈ విధంగానే వుండే యెడల కంట్రోళ్లు అమలు చేయవలసిన అవసరమే యుండదని ఆయన చెప్పెను. బట్టపై ఎగుమతి పన్ను విధించుటచేత (ఇది యిటీవల తగ్గింపబడి యుండెను) ఎగుమతి కోటా 15 కోట్లు గజములుగా నుండి నప్పటికి ఒకకోటి గజములు మాత్రమే ఎగుమతి యయ్యెను. పాకిస్తాను ప్రాంతములలో బట్ట వినియోగము 70 కోట్ల గజములైనప్పటికి ఇండియా-పాకిస్తాను ఒడంబడిక ననుసరించి పాకిస్తాను 45 కోట్ల గజముల బట్టనూత్రమే పుచ్చుకొనును. 1949 సం॥ ఆగస్టు అంతము వరకు పాకిస్తాను 3 లక్షల బేళ్లు కొనవలసి యున్నది. ఈ కోటాలో 1948 సం॥ డిసెంబరు 9 వ తేదీవరకు పాకిస్తాను 75 వేల బేళ్లు మాత్రమే పుచ్చుకొనును. బట్టల వ్యాపారం ఉభయ ప్రభుత్వముల మధ్య జరుగుచుండుటచేత బట్ట కొనుటకు పాకిస్తాను టెక్‌స్టయిలు కమిషనరు భారతదేశము వచ్చియున్నాడు.

బొంబాయిలో సం॥ మునకు 20 గజాల గుడ్డ

బొంబాయి, నవంబరు 30: బొంబాయిలో బట్టల రేషనింగు రేపు అమలులోనికి రానుండుటచే సంపన్నులు నేడు బట్ట విస్తారముగా కొనుచుండిరి. చిల్లర దుకాణములలో మేలురకముల లభ్యము కాకుండెను. మితరకములను విడుదలచేయుటపై వారు దృష్టి కేంద్రీకరించిరి.

రేపటినుండి బియ్యపు రేషనింగల ప్రతివారికి సం॥మునకు 20 గజముల ముతక గుడ్డ లేదా 10 గజముల సన్నని గుడ్డ ఇచ్చెదరు. 6 ఏండ్లలోపు పిల్లలకు 10 గజములిచ్చెదరు. పూనా, అహమ్మదాబాదు, షోలాపూరు నగరములలో పంపకము బొంబాయి యందున్నట్లే యుండును. పట్టణ, గ్రామప్రాంతములలో మాత్రము తలకు 18 గజములు మాత్రమే యిచ్చెదరు. కొన్ని రకముల భారత మిల్లుబట్టలు, చేనుగ్గములు నరమగ్గములలో ఉత్పత్తియైన బట్ట దిసమతియైనబట్ట రేషనింగునుండి మినహాయింపబడినది. ఈ రకముల బట్టలు పుష్కలముగా లభించును. రేషను చేయబడిన రకముల పట్టికలో ఏ రకమును బట్టిన ఆరకమును చేర్చుటకు, లేదా మినహాయించుటకు ప్రభుత్వమువారు అధికారము కైకొనిరి. (ఆ. ప్రె.)

రాజ్యాంగ పరిషత్తు

బిరుదములరద్దువిషయమై నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 1: నేడు రాజ్యాంగ పరిషత్తు సమావేశమైనప్పుడు, బిరుదులను రద్దుచేయవలెననుఅంశము ఆమోదింపబడినది. ఈ అంశముపై నిన్న పూర్తి చర్చలు జరిగినవి. మిలిటరీ బిరుదులకుగాని విద్యా, సంస్కృతి విషయములనిరుదులకుగాని ఈ అంశము వర్తింపరాదని టి. టి. కృష్ణమాచారి సూచించిన సవరణకూడ ఆమోదింపబడినది.

తరువాత "ప్రాథమికహక్కుల" అధ్యాయముపై చర్చలు తిరిగి మొదలైనవి. వాక్స్వాతంత్ర్యము, నిరాయుధముగా, ప్రశాంతముగా సమావేశమగు హక్కు, ఇండియాలో ఎక్కడనైన స్వేచ్ఛగా సంచరించుటకు, నివాసమేర్పరచుకొనుటకు, ఆస్తిని సంపాదించుకొనుటకు, ఆస్తిని, ఉంచుకొనుటకు, అమ్మివేయుటకు హక్కులు, ఏ వృత్తినిగాని, వ్యాపారమునుగాని స్వీకరించుటకు హక్కులు ఈ అధ్యాయమందలి "వ్యక్తిగత హక్కుల" అంశములో పొందుపరుపబడి యున్నవి.

ఈ సూత్రములలోని అనేక నిబంధనలను తొలగించి, దీనిని తిరుగ వ్రాయవలెననియు, పత్రికా స్వాతంత్ర్యము ప్రత్యేక హక్కుగా ఉదహరించబడవలెననియు, ఉత్తరములు టెలిగ్రాములు మొదలైనవి రహస్యముగా ఉంచబడవలెననియు ఒక సవరణ ప్రతిపాదించుచు, దామోదర స్వరూప సేఠ్, ఈ సూత్రములోని హక్కులన్నియు నిబంధనలచేత అపహరించబడుచున్నవని విమర్శించెను.

ప్రొ॥ కే. టి. షా మరియొక సవరణ చేయుచు ప్రాథమికహక్కులు రాజ్యాంగ పథకమునకు లోనై ఉండవలెనుకాని ప్రత్యేక నిబంధనలకు లోను కారాదనియు, పౌరులకు హక్కులున్న మాత్రమున చాలదనియు, అవి అమలుజరుగుటకు సదుపాయము లుండవలెననియు, సూత్రములో హక్కులకన్న నిబంధనలు అధికముగా నున్నవనియు, ఈ నిబంధనలు తొలగనిచో ఈ సూత్రము రాజ్యాంగ పథకమునకు విరుద్ధముగా పరిణమించుననియు చెప్పెను. పౌరులకు భావ, ఆరాధనా, పత్రికా, ప్రచురణా స్వాతంత్ర్యము లుండవలెనని ప్రొ. షా మరియొక సవరణ ప్రతిపాదించుచు, ప్రపంచములో అన్ని దేశములను, ఐక్యరాజ్య సమితియు అతిప్రధానముగా భావించుచున్న పత్రికా స్వాతంత్ర్యమును ఈ ముసాయిదాలో చేర్చకపోవుట ఆశ్చర్యజనకముగా నున్నదని చెప్పెను.

ఆయుధములు కలిగి యుండుటకును పెంట నుంచుకొనుటకును పౌరులకు హక్కుండవలెననీ, ప్రజాక్షేమముకొరకు ప్రభుత్వములు చేయు శాసనములకి హక్కు అడ్డురాకూడదనీ ఎచ్. వి. కామత్ మరియొక సవరణ ప్రతిపాదించుచు, ఆత్మరక్షణకు గాను ఆయుధములు ధరించు అవసరము అందరికిని కలదనియు, కరాచీ సమావేశ సమయమున కాంగ్రెసు ఇట్టి తీర్మానమును చేసెననియు చెప్పెను.

గాంధీ హత్యకేసు

ఢిల్లీ, డిశంబరు 1: గాంధీ హత్యకేసు నేటితో 3 వ అధ్యాయమును ప్రవేశించినది. ప్రాసిక్యూటర్ సి. కె. దఫ్తారీ నేడు తన ఆర్గ్యుమెంట్లను ప్రారంభించెను.

బొంబాయి ప్రజాశాంతి రక్షణచట్టము ఢిల్లీ రాష్ట్రమునకు సూచనవర్తింపజేయబడినందున, ఆ చట్టము ననుసరించి ఈ ప్రత్యేక న్యాయస్థానము, ప్రత్యేకజడ్జి ఏర్పడెననీ, కనుక ఈ కోర్టుకు గాంధీ హత్యకేసును విచారించు అధికారమున్నదని ముందుగా దఫ్తారీ అన్నాడు.

ముద్దాయి బాడ్జేను తుమించి అప్రూవరుగా అంగీకరించుటపై మదన్లాల్ న్యాయవాది బానర్జీ ఇదివరలో చూపిన అభ్యంతరమును ఖండించుచు, తుమించే హక్కును జడ్జికి యిచ్చుచు భారత ప్రభుత్వము కేసు విచారణకు ముందే ఒక ఆర్డినెన్సు జారీచేసి యున్నదనీ, ఈ ఆర్డినెన్సు ఇప్పుడు శాసనముగా చేయబడినదనీ దఫ్తారీ వాదించెను.

సరకు మిగులు గూర్చి తెలపాలి

మదరాసు, డిశంబరు 1: విల్లు వస్త్రాలు నూలు విక్రయదారులందరు యీ రాష్ట్రంలో నున్నవారు నవంబరు 30 తేదీ నాటికి తమవద్ద ఎన్ని రకాల సరకు అధికారుల ముద్ర పడకుండా చెల్లకుండా మిగిలియుండో తనకు డిశంబరు 7 వ తేదీలోగా తెలియజేయాలని రాష్ట్రీయ టెక్‌స్టయిలు కమిషనరుగారు ప్రకటించిరి.

డిసెంబరు నెలకు చన్నరాష్ట్రానికి 38450 బేళ్ళ వస్త్రములు 27500 బేళ్ళ నూలు కోటా నిర్ణయించబడినది. ఇందు 14400 బేళ్ళు మిల్లు వస్త్రములు, 4050 బేళ్లు చేనేతవస్త్రాలు. నూలుకు కోటాయు అదేరకు రావలసింది మొత్తం 24000 బేళ్లు పై రాష్ట్రాల నుండి యిక్కడికి బట్టలు దేరినవి ఎక్కువ కోటా వచ్చుటల్లప్రతి వ్యాపారస్తులలో 70% వంతు మందికి లైసెన్సులు యివ్వగలము.

'కృష్ణా, గుంటూరు, నల్లగొండ, ఓరుగల్లు ఒకే పరిపాలనక్రింద ఉండాలి'

కమ్యూనిస్టు ముప్పును అరికట్టుటకు ఇదే మార్గమని రంగాగారి సూచన

విజయవాడ, నవంబరు 30: కృష్ణా, గుంటూరు జిల్లాలను, పోటి నానుకొని, నిజాం సంస్థానంలో, ఉన్న నల్లగొండ, వరంగల్లు జిల్లాలను ఒకే పరిపాలనకిందవుంచి, తగు సైనికబలమును ఆ పరిపాలక వర్గము ఆధీనమం దుంచుటయే, అచ్చట ఈమధ్య చెలరేగిన కమ్యూనిస్టు దౌర్జన్యములను అరికట్టుటకు మార్గమని శ్రీ ఎన్. జి. రంగాగారు సూచించిరి.

ఈ నాలుగు జిల్లాలలోను కమ్యూనిస్టు దౌర్జన్యములు చెలరేగుటకు, వారు గ్రామములను క్రూరముగా హింసించుటకు ఈ నాలుగు జిల్లాలలో రెండు ఒక పరిపాలన క్రిందా మిగతా రెండూ వేరొక పరిపాలన క్రిందా ఉండుటయే అవకాశ మిచ్చుచున్నది. వారి దౌర్జన్యములు రజాకార్ల ఘాతుకములను మించుచున్నవి. ఈ ప్రాంతమంతయు ఒకే పరిపాలనక్రింద ఉంచి, కమ్యూనిస్టుల దౌర్జన్యములను ఎదుర్కొనుటకు పౌరరక్షణ దళములను, గ్రామ పంచాయతీదారులకు మంచిశిక్షణను ఆయుధములు ఇవ్వవలెను. లేనిచో కమ్యూనిస్టులు బలపడి, మిగతా ప్రాంతములకుకూడ ముప్పు వాటిల్లును. అనిరంగాగారనిరి.

హైదరాబాదు సంస్థానములో పోలీసు చర్యలు జరుగుటకుముందు, తర్వాతకూడ కమ్యూనిస్టులు రజాకార్లనుండి ఆయుధములు, మందుగుండు సామాను విస్తారముగ సేకరించుకొనినట్లు తెలిసినది. ప్రజానీకమును దోచి చాలడబ్బు కూడ పోగుచేసికొనిరట. ఇప్పుడు ఆ ఆయుధసామగ్రిని ప్రజలను బెదరగొట్టి రాజఆకం తెచ్చిపెట్టుటకు ఉపయోగించుచున్నారు. ఇటీవల తెలియవచ్చినఈకమ్యూనిస్టుల ఘాతుకములు వారి ఉద్దేశములకు, ఆయుధ బలమునకు తార్కాణంగా ఉన్నవి. ఇంతే కాక పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెస్, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘములవద్ద, కమ్యూనిస్టులు కాంగ్రెస్ వాదుల ప్రాణములు తీసెదమని బెదిరించుచు వ్రాసిన ఉత్తరములు కూడ ఉన్నవట. ఆ ఉత్తరములలో, భారతదేశములో కూడ చైనాలో జరిగినట్లే జరుగునని, ప్రస్తుత జాతీయ ప్రభుత్వమును, కాంగ్రెస్ నాయకత్వమును తుదముట్టించుటకు, భారతదేశములో 'సోవియట్' పరిపాలన నెలకొల్పుటకు కమ్యూనిస్టులు పూనుకొనిరని చాటిచెప్పిరట. (స్వ. వి.)

కాంగ్రెసు కార్యకర్తల హత్యలు

నిజాంలో కమ్యూనిస్టుల ఘాతుకములు

ఓరుగల్లు, నవంబరు 29: ఇప్పటికి 20 మైళ్ళలో వున్న ఇప్పగూడెం, గబ్బెటలలో కమ్యూనిస్టులు 5 మంది కాంగ్రెసు కార్యకర్తలను హత్యచేసిరి. కాంగ్రెసు వారు శిబిరములలో పంపుకొనియుండగా వారిని బయటకులాగి కాల్చివేసిరట.

పంటబావులు త్రవ్వుటకు ప్రభుత్వ సహాయం

1949 జూన్ వరకూ వ్యవధి

చెన్నపట్టణం, డిసెంబరు 1: పంట బావులు త్రవ్వుటకు రైతులకు ధనసహాయం చేయుటకుగాను ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమానికి వ్యవధి 1949 జూన్ 30 వ తేదీవరకూ పొడిగించబడినట్లు నేడొక ప్రభుత్వప్రకటన తెలుపుచున్నది. ఆలోగా రైతులు బావులు త్రవ్వుట ప్రారంభించనిచో, వారికిచ్చుగ్రాంటులు రద్దుచేయబడునని ప్రభుత్వం హెచ్చరించుచున్నది.

పంటలకు అపాయం

మద్రాసు, నవంబర్ 30: వ్యవసాయాన్ని అభివృద్ధిచేసి, పంటల నధికంగా పండించే నిమిత్తం ట్రాక్టర్లను ప్రవేశపెట్టవానికిమద్రాసు ప్రభుత్వం ప్రయత్నిస్తూన్ని ఈ సమయంలో విశాఖపట్టణం జిల్లాలో వరిపంటను మిడతలు, మరి ఇతర పురుగులు నాశనం చేస్తున్నాయని తెలుస్తున్నది. ఈ సంవత్సరంలో అక్కడి పంటలు సాధారణ పంటలలో మూడవవంతు మాత్రమే ఉంటాయని గ్లోబ్ విలేకరికి తెలియవచ్చింది. గ్లోబ్.

షరీఫుద్దీన్ బందీగా చిక్కెను

బటేవియా, డిశంబరు 1: ఇండోనీషియాలో కమ్యూనిస్టుప్రభుత్వ ప్రధానిగా నున్న అమీర్ షరీఫుద్దీను రిపబ్లికను సేనలు కైదీగా పట్టుకొనినవి.

పాలస్తీనా విభజనపై చర్చ

సమితి రాజకీయసంఘ సమావేశం

పారిస్, నవంబరు 30: పాలస్తీనా విభజన పథకము అమలు జరుపవలెనా, కాంటు బెర్నాడోట్ సూచనల ప్రకారముగా లిప్రాంతము యూదులకున్నూ, నెగెవ్ ప్రాంతము అరబ్బులకున్నూ పంచవలెనా, లేక రెండు పథకములు నున్నూ ఏకోవిధముగా సమన్వయపరచవలెనా అను విషయము విశ్వరాజ్య రాజకీయ సంఘములో నేడు చర్చకువచ్చెను. పాకిస్తాను ప్రతినిధి జఫ్రుల్లాఖాన్ మాట్లాడుచు, రెండుపథకములూ క్రూరముగా నున్నవనియు యూదుల ప్రాంతములో అరబ్బులు శాశ్వతముగా అల్పసంఖ్యాకులైపోవు ఏర్పాటును పాకిస్తాను ఆమోదించదనియు, అరబ్బులు విరోధించినచో యూదులు తమ ఆయుధబలముతోనూ, సర్వప్రతినిధిసభలో తమకుగల ఓట్లతోనూ శాంతి సాధించలేరనియు, ఎట్టి విభజన జరిగినను అది అరబ్బు యూదు ప్రజలు తమ అనుభవమీద కోరునదిగా నుండవలెననియు చెప్పి, ఇండియా పాలస్తీనాలకుగల విభేదములను వివరించెను.

బ్రిటిషు ప్రతినిధి, బీలీ అమెరికా అభిప్రాయములకు అనుకూలముగా నుండుటకు బెర్నాడోట్ పథకమును సమర్థించుట మానివేసి తన ప్రతిపాదనను మూడవపారి స్థిరీకరించుకొనెను. కానీ ఆస్ట్రేలియా, కొలంబియా, పోలండులు సమర్థించిన తొలి విభజన పథకమునాయన ఆమోదించలేదు; ఫెడరలు విధానముతో ఒక యూదు అరబ్బు రాజ్యము స్థాపించుటకు విరియా చేసిన సూచనలుకూడా ఆమోదించలేదు. పాలస్తీనా రాజీ కమిషనువారు పనిచేయుటకు ఒకే ఒక సూత్రము ఆధారముగా ఉండరాదని కెనడా చేసిన సూచనకు బీలీ సమ్మతించెను.

రష్యా ప్రతినిధి సెమ్యోన్ త్సారాపాకిన్, అమెరికా బ్రిటనులు తమ స్వలాభములకనుకూలముగా పాలస్తీనా స్వరూపము మార్చ చూచుచున్నవని నిందించి, 1947 లో చేయబడిన పాలస్తీనా విభజన పథకమునే బలపరిచెను. పాలస్తీనాలో కొంత భాగమును ట్రాన్స్‌జోర్డన్ కింద నుంచి బ్రిటిషువారు కలుపుకో జూచుచున్నారు. ఇది సర్వప్రతినిధి సభోద్దేశమునకు విరుద్ధమనియూ అరబ్బు రాజ్యములు విభజింప బడవలెనని అదివరకే నిర్ణయించబడినది, అని ఆయన చెప్పెను.

ఇజ్రాయిలు ప్రతినిధి, ఆబ్రీ ఇబాన్, రాజీ సంఘమువారు సూచనలు చేసి అరబ్బు యూదుల మధ్య సామరస్యము సాధించవచ్చునని తమ నిర్ణయములు ఉభయులపైనను రుద్దరాదనియు, ఈ కమిషనులో ప్రపంచమునందలి భిన్నప్రాంతములవారికి ప్రాతినిధ్య ముండవలెననియు, ఈకమిషను భద్రతామండలికాక సర్వప్రతినిధి సభకు బద్ధమై ఉండవలెననియు, దీనికి పరిహర్తులు నిర్ణయించు అధికార ముండరాదనియు సూచించెను.

అరబ్బు యూదుల యుద్ధ విరమణ

జరుసలేము, నవంబరు 30: యూదు అరబ్బుపక్షాల ప్రతినిధులు, ఐక్యరాజ్య యుద్ధవిరమణ సంఘ సభ్యుల ఎదుట నేటి ఉదయము యుద్ధ విరమణ అంగీకారపత్రములపై సంతకములు చేసిరి. ఇది జరిగిన గంట లోపుగానే యూదులు తుపాకులు పేల్చిరనియు, మాంటుజియోనుపద్దనున్న ఒక లీజియను అధికారి గాయపడెననియు, జరుసలేములోని ఇతర ప్రాంతములలో కూడా యూదులు యుద్ధమారంభించిరనియు అరబ్బు లీజియనువారు ప్రకటించిరి.

అమెరికా, చైనా స్నేహ ఒప్పందము

వాషింగ్‌టన్, నవంబరు 30: నాకా, వాణిజ్య స్నేహసంబంధములు పరస్పరము పెంపొందించుకొనుటకు అమెరికా చైనాలు ఐదేండ్ల ఒడంబడికను నేడు నాన్‌కింగులో సంతకపరచి కొనినట్లు స్టేట్ డిపార్టుమెంటు ప్రకటించినది

యం.

ఫర్మోజాదీవులకు చాంగ్ ప్రభుత్వ కేంద్రం మార్పు

నాన్‌కింగ్‌ను ఖాళీచేయడానికి ఏర్పాట్లు

పెంగ్పూ శత్రువశం; సూచౌనుండి ప్రభుత్వసేనల నిర్గమనం

నాన్‌కింగ్, డిసెంబరు 1: నాన్‌కింగులోని సిబ్బందులను వెంటనే ఫోర్మోసాదీవికి కొనిపోవలెనని విమానశాఖకు ఉత్తరువు చేయబడినది. తనకు అపజయము కలిగినచో చాంగ్ కైషేక్ తన ప్రభుత్వమును ఇక్కడికి మార్చుకొనునని ఇటీవల తెలిసినది.

నాన్కింగ్‌పై కమ్యూనిస్టుల కత్తెర వ్యూహం

నాన్కింగు, నవంబరు 30: నేడు కమూనిస్టు సేనలు నాన్కింగుపై ఆరంభించిన కత్తెర వ్యూహమువల్ల చాంగ్‌కైషేక్ ప్రధానపట్టణమునకు కొద్దిరోజులలో పతనము తప్పనట్లు కనబడుచున్నది. 800 మైళ్లు దక్షిణముగానున్న కాంటనుకు పోవుటకు చైనా ప్రభుత్వమువారు ఉద్యమించుచున్నారు. అమెరికను రాయబార కేంద్రమువారు విమానములపై మనిలాకుపోవుటకు సిద్ధముగానున్నారు. నాన్కింగు పతనమైనదో మరికొద్దిరోజులలో గాని వారములలో గాని షాంఘై రేవు పతనము కాక తప్పదు. షాంఘై నాన్కింగుకు ఆగ్నేయముగా 200 మైళ్లదూరమున ఉన్నది.

సూచౌ పతనం

మధ్య చైనా కొరకు తీవ్రయుద్ధం

నాన్‌కింగ్, నవంబర్ 30: జనరలిస్మో చాంగ్‌కైషేక్, నేడు సూచౌదుర్గమునుండి సేనల నన్నిటినీ ఉపసంహరించి పెంగూ రక్షణార్థము దక్షిణమునకు పంపియున్నాడు. మధ్య చైనా సమర రంగమునకు పెంగూ ప్రధాన యుద్ధక్షేత్రముగా మారుచున్నది.

పెద్దపెట్టున కమ్యూనిస్టు సేనల చుట్టుముట్టుచున్న ఈ పెంగూదుర్గము నాన్‌కింగ్‌కు ఒక నూరుమైళ్ళ దూరమునమాత్రమే యున్నది, రాజధాని రక్షణ కట్టకడపటి రక్షణదుర్గమై యున్నది.

సూచౌనుండి తిరోగమించుచున్న సేనలలోని వైనకభాగములు, కమ్యూనిస్టు లాక్రమించియున్న సూపెయిన్ రైల్వేకేంద్రముపై మోహరించి నడచుచున్నవి. కేంద్ర సమీప్యమునకు వచ్చుచున్నవి. ఈ రైల్వే కేంద్రం అసలు యుద్ధక్షేత్రమునకు (పెంగూకు) ఉత్తరముగా నున్నది.

పెంగూ రంగమున ప్రభుత్వసేనలు నోరార్థముగ మోహరించుచున్నవి. నాన్‌కింగ్ నుంచి మరికొన్ని సేనలుకూడ వీని సహాయార్థం వచ్చుచున్నవి.

నిన్నటివరకునూ సూచౌదుర్గము మధ్య చైనా సమర రంగమున నెల్ల ప్రధాన కీలకస్థానముగ అభివర్ణింపబడినది. ఇప్పుడచ్చట నున్న ప్రభుత్వబలము ఒక 74 దళములు మాత్రమే. నాన్‌కింగ్‌కు ఉత్తరముగా నున్న, హుచెంగ్ అను మరియొక ప్రధాన రైల్వే కేంద్రముగూడ నిన్నటిదినము కమ్యూనిస్టుల చేతులలో పడినది. యుద్ధ ప్రమాదము శృతిమించినదని వార్త తెలియగనే, షాంఘైలో మిగిలియున్న అమెరికనులలో 200 మంది నేడు ఖాళీచేసి వెళ్లిపోయిరి. మరియొక 450 మంది ప్రయాణమునకు సిద్ధముగా నున్నారు. అమెరికా రాయబారవర్గమునకు చెందిన 110 మంది నాన్‌కింగ్ షాంఘైలనుండి ఒకరొకరే విమానములలో వెళ్లిపోవుచున్నారు.

పెంగూకూడ పతనమై పోయినదని షాంఘైలో కల్లంతుగా చెప్పుకొనుచున్నారు. షాంఘై రైల్వేను కాపాడుటకు అమెరికాసాకలను పంపునని తెలియుచున్నది. నాన్‌కింగ్‌కు ఉత్తరమున 160 మైళ్ల దూరములోనున్న హుచెంగ్ రైల్వే కేంద్రమునుగూడ నిన్నటిదినము కమ్యూనిస్టుల చేతులలో పడినది. యుద్ధ ప్రమాదము శృతిమించినదని వార్త తెలియగనే, షాంఘైలో మిగిలియున్న అమెరికనులలో 200 మంది నేడు ఖాళీచేసి వెళ్లిపోయిరి. మరియొక 450 మంది ప్రయాణమునకు సిద్ధముగా నున్నారు. అమెరికా రాయబారవర్గమునకు చెందిన 110 మంది నాన్‌కింగ్ షాంఘైలనుండి ఒకరొకరే విమానములలో వెళ్లిపోవుచున్నారు.

పెంగూకూడ పతనమై పోయినదని షాంఘైలో కల్లంతుగా చెప్పుకొనుచున్నారు. షాంఘై రైల్వేను కాపాడుటకు అమెరికాసాకలను పంపునని తెలియుచున్నది. నాన్‌కింగ్‌కు ఉత్తరమున 160 మైళ్ల దూరములోనున్న హుచెంగ్ రైల్వే కేంద్రమున

అమ్మకము

వాల్టేరులోని పెద్దకాగా, యిల్లు అమ్మబడును. లాభకరమైన పెట్టుబడి. నిన్న పగు. న్యాయములకు మృష్టము. వ్రాయుడు:- HENRY MARSHALL, I Rawdon Street, Calcutta 16, West Bengal

టెండరు

ఎం. అండ్ ఎస్. ఎం. రైల్వే

దిగువ సెక్షనులమీద శిథిలమైన క్వార్టర్లను నిర్మించు సందర్భమున ఫిట్టింగులతో కంప్లీటుగా కొయ్య తలుపులు, కిటికీలు, కొయ్యకడ్డీలు, పలకలు, కిరణాలు సప్లయి చేయుటకు కంట్రాక్టుల రేటుకు, "Supply of Wooden Doors and Windows Complete with fittings and Timber Scantlings, Planks and reepers" అని సూపర్ స్క్రయిబ్ చేసి సీలు వేసిన టెండర్లు 22-12-1948 పగలు 12 గం.ల వరకు మద్రాసు పి. టి. ఎం. అండ్ ఎస్. ఎం. రైల్వే, చీఫ్ యింజనీరుగారికి కోరబడుచున్నవి.

1. మద్రాసు - జాలార్పేట సెక్షన్
2. మద్రాసు - బెజవాడ
3. ఆర్కోణం - రాయ్‌చూర్
4. బెజవాడ - రాజమండ్రి
5. హుగ్లీ - మిరాజ్
6. మిరాజ్ - పూనా

ఒక్కొక్కదానికి పది రూపాయల వంతున చెల్లించి దరఖాస్తుమీద చీఫ్ ఇంజనీరుగారి కార్యాలయంనుండి టెండరుఫారములు పొందవచ్చును. ఈ సొమ్ము వాపసు చేయబడదు.

పై సెక్షనులలో ఒక్కొక్కదానికి టెండరుదారులు వేర్వేరు షెడ్యూల్సు పూర్తి చేయవలసి యున్నది. ఒక్కొక సెక్షనుకు ముందుగా రు. 1000/-ల వంతున తరావతు సొమ్ము చెల్లించవలెను.

టెండరు యావత్తుగాని కొంతభాగంగాని అంగీకరించుటకు చీఫ్ యింజనీరుగారికి అధికారము కలదు.

త్రికాల వేది, జ్యోతిష్య చక్రవర్తి,

ప్రొఫె. కె. అంజి.

75 నయనప్పనాయుకన్ వీధి, P.T. మద్రాస్ సలహా, పు 5, సం. ఫలం దొరే. 5. 10. పూర్వ జాతకం 25,50,100,150,250. ప్రశ్నలు 7 రు॥ బ్రాంచి: 750 ట్రిప్లికేన్ హైరోడు, మద్రాసు.

నోటీసు

తణుకు డి॥ ముం॥ కోర్టు

O. S. 20/1948

వాది:-దివ్వెల వెంకటేశ్వర్లు సా॥ వేల్పూరు పల్లిమగోదావరిజిల్లా.

ప్రతివాదులు:-1 లక్ష్మణమహంతి, 2. సుబ్బారావు మహంతి సా॥ కంబిలిగాం గంజాంజిల్లా.

ప్రతివాదులువల్ల రావలసిన పట్టి దాఖలా వడ్డీ సహా రు. 456-9-6 రాబట్టుకునే నిమిత్తం వాదివల్ల ప్రతివాదులపైన ఈ నెంబరున దావా దాఖలు కాబడి ప్రతివాదులుకు అభ్యంతరములు వుంటే యెడల హాజరయి దాఖలుచేసుకునే నిమిత్తం 14-12-1948 తేదీ మధ్యాహ్నం 11 గంటలకు స్వయముగా గాని వకీలు ద్వారా గాని హాజరు కావలసినదిగా ఇందు మూలముగా తెలియపర్చబడుచున్నారు.

బలిజేపల్లి వెంకటసుబ్బారావు, వాది ప్లీడరు.

వికటన్ మాస్కు తక్కపొడి

50 రకాల ప్యాకింగ్ అ. 1 రు. 7 నెలకు రు 60/- నుండి రు 100/-ల వరకు జీతం మీద కార్యాలయము కావలెను. వికటన్ కార్యాలయము, 11-పిడి. మద్రాసు.

నోటీసు

ఎం. అండ్ ఎస్. ఎం. రైల్వే.

బెజవాడలో కృష్ణా బ్రిడ్జిపైన 1949 సం॥నకు టోల్సు వసూలు చేసుకొనుటకు టెండర్లు

బెజవాడలో కృష్ణా బ్రిడ్జిపైన శాలిబాటలమీద 1949 సం॥నకు టోల్సు వసూలు చేసికొను హక్కుకు 20-12-1948 సోమవారము పగలు 12 గం.ల వరకు మద్రాసు, ఎం. అండ్ ఎస్. ఎం. రైల్వే, జనరల్ ఆఫీసులలోని, చీఫ్ ఆపరేటింగ్ సూపరింటెండెంట్ గారి ఆఫీసులో టెండర్లు తీసుకొనబడును.

కంట్రాక్టు షరతులు కలిగిన నోటీసు, టెండరు ఫారములు, చీఫ్ ఆపరేటింగు సూపరింటెండెంటుగారియొక్కయు, బెజవాడలోని డిస్ట్రిక్టు ట్రాన్స్‌పోర్టేషన్ సూపరింటెండెంటు (ట్రాఫిక్) గారియొక్కయు జాయింటు స్టేషన్ మాస్టరుగారియొక్కయు ఆఫీసులో పొందవచ్చును.

మద్రాసు, 29-11-1948. } P. A. F. Cory, Chief Operating Superintendent.

టెండరు నోటీసు

మద్రాసు గవర్నమెంటు

ఎలెక్ట్రిసిటీ డిపార్టుమెంటు—మాచ్ ఖుండ్ హైడ్రో ఎలెక్ట్రిక్ స్కీం

బొబ్బిలి ఆర్. ఎస్. బి. ఎ. రైల్వే నుండి మాచ్‌ఖుండ్ (కోరపుట్, జయపూర్ మీదుగా)కు సామానులు లారీలలో రవాణా చేయుటకు సీలువేసిన టెండర్లు 3-1-1949 సా॥ 3 గం॥లకు ఈ ఆఫీసుకు చేరులాగున దిగువ సంతకదారుచే తీసుకొనబడును.

2. దిగువ సంతకందారు యొక్కయు, (2) ఎగ్జిక్యూటివ్ యింజనీరు, ఎలెక్ట్రికల్ అండ్ మెకానికల్ డివిజన్, IV మాచ్ ఖుండ్ (Via) జయ్‌పూర్ (ఒరిస్సా) యొక్కయు, (3) ఎగ్జిక్యూటివ్ యింజనీర్, పి. డబ్లు. డి. కోరాపుట్, (ఒరిస్సా ప్రావిన్సు)యొక్కయు ఆఫీసుకు దరఖాస్తు చేసి, టెండరు నోటీసు, మొత్తముల షెడ్యూల్సు, ఉచితముగా పొందవచ్చును.

3. డిపార్టుమెంటు ఫారములో గడువు తేదీలోగా పంపని టెండర్లు విచారింపబడవు.

సూపరింటెండింగ్ యింజనీర్,
వాల్టేరు, ఆంధ్రాలాండ్సు.

టెండరు నోటీసు

శ్రీ విజయవాడ సర్కిల్ సూపరింటెండింగ్ యింజనీరుగారు.

తేది 23-12-48 తేది సాయంత్రము మూడు గంటలవరకు రొంపేరు మురుగు కాలువ సందర్భములో మురుగు కాలువలు త్రవ్వుటకుగాను సీలు చేయబడిన టెండర్లు తీసికొనబడును. ఇందు విషయమై యితర వివరములు తెలిసికొనగోరువారు శ్రీ రొంపేరు డివిజను ఎగ్జిక్యూటివు యింజనీరుగారి ఆఫీసులోగాని శ్రీ సూపరింటెండింగు యింజనీరుగారి ఆఫీసులోగాని విచారించవలెను. టెండరు కాగితములు కావలసినవారు ప్రతి టెండరు కాగితముకు రు. 5-2-0 చొప్పున శ్రీ విజయవాడ సర్కిల్ సూపరింటెండింగు యింజనీరుగారి ఆఫీసునుండి కొనవలయును.

టెండర్లు మొత్తము 11.

ఒక్కొక్క టెండరు ప్రథమ ధరావతు రు. 1100/-ల నుంచి రు. 3000/-లు వరకు.

విజయవాడ, 10-11-1948. } సూపరింటెండింగ్ యింజనీరు, విజయవాడ సర్కిల్.

టెండరు నోటీసు

పనియొక్క పేరు:—పెదలంక మురుగుకాలవ త్రవ్వుట.

(1)	మై	23-4-830	నుంచి	మై 24-8-0	వరకు
(2)	,,	24-8-0	నుంచి	,, 25-1-0	వరకు
(3)	,,	25-1-0	నుంచి	,, 25-4-880	వరకు

ప్రథమ ధరావతు:—ప్రథమ ఖండమునకు రు. 1,800/-
రెండవ ఖండమునకు రు. 2,300/-
మూడవ ఖండమునకు రు. 1,400/-

మట్టిపని వివరము:—ప్రథమ ఖండము 2420 యూనిట్లు
రెండవ ఖండము 3040 ,,
మూడవ ఖండము 1780 ,,

పైన వుదహరింపబడిన ప్రతి ఖండమునకు, సీళ్ళువేయబడిన టెండర్లు శ్రీ విజయవాడ సూపరింటెండింగు యింజనీయరుగారికి ది 22-12-48 సాయంత్రము మూడు ఘంటలలోపుగా పంపుకొనవచ్చును. యీ సందర్భములో కావలసిన యితర హంశములు, ప్రతి ఖండమునకు టెండరు కాగితములు రు 5-2-0 (అమ్మకపు పన్నుతో సహా) చొప్పున వారి ఆఫీసునందు కొన్న యెడల తెలియగలవు. యీ సొమ్ము అనగా రు. 5-2-0 యే కారణముచేత నైనను వాపసు యివ్వబడదు.

(సం.) డి. పి. జాగ్,
సూపరింటెండింగు యింజనీయరు,
విజయవాడ సర్కిలు.

ప్రభుత్వోద్యోగాల సంపాదనకు భారతీయులందరికీ సమానావకాశం

ప్రాథమిక హక్కులపై రాజ్యాంగపరిషత్తు చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: రాజ్యాంగపరిషత్తు తిరిగి నిన్న సమావేశమైనపుడు, ప్రాథమికహక్కులపై చర్చ కొనసాగినది. మరణదండనను రద్దుచేయవలెనని లాహిరీ ప్రతిపాదించిన సవరణను పరిషత్తు తిరస్కరించినది. (ఈ వివరములు నిన్నటిపత్రికలో ప్రకటింపబడినవి.) అనంతరం భారతీయులు యావన్మందికీ ప్రభుత్వోద్యోగాలను పొందుటలో సమానావకాశాలుండాలని తీర్మానించింది.

సైతికంగా పెద్ద బాధ్యత కలిగిన ఉద్యోగములకు, పదవులకు, భారతీయులకే తప్ప పరదేశీయుల కివ్వరాదని ప్రొ॥ కె. టి. షా ప్రతిపాదించెను. ఇతర దేశములు ఇట్లే చేయుచున్నవని, దక్షిణ ఆఫ్రికా కెనడా ఆస్ట్రేలియాలవంటి కామన్వెల్తు దేశములుకూడ భారతీయుల కట్టి ఉద్యోగములు నివ్వక స్వదేశీయులకే యిచ్చుకొనుచున్నవనీ, ఇండియా వంటి నూతన దేశము త్వరలో అభివృద్ధి పొందవలెనంటే స్వదేశీయుల నీతి ధంగా ఆదరించవలెననీ కూడ అతడుద్ఘాటించెను.

ఏదైనా ఉద్యోగమును అర్హతను బట్టి ప్రసాదించవలెనుగాని అతని జన్మప్రాంతమును బట్టి నిర్ణయించరాదని ప్రొ॥ జస్వంత్ రాయ్ కపూర్ మరొక సవరణను సూచించెను. ఇండియాలో ఒకే పౌరస్వత్వమును మనము తెలపాల్సిందే వుచున్నాము. ఏ ప్రాంతానికి చెందినా అర్హత ఉంటే ఉద్యోగములో చేర్చుకోబడవలెను. బెంగాల్‌లోని ఉద్యోగము లన్నీ బెంగాలీలకే ననీ, మద్రాస్‌లోని ఉద్యోగాలన్నీ మద్రాసీలకే ననీ చేయబడే నినాదాల కర్థంలేదు అని ప్రొ॥ కపూర్ పాదించెను.

నీకైనా ఒక రాష్ట్రంలో, కొన్ని రకాల ఉద్యోగాలకు, పదవులకు అధికారులను నియమింప వలసి వచ్చినప్పుడు, అంతకు ముందునుండీ ఆ రాష్ట్రంలో నివసించినవారు మాత్రమే వాటికి అర్హులని స్థానిక ప్రభుత్వము నిర్ణయించుటకు సంపూర్ణాధికారముండవలెనని, ఈ అధికారమును ఈ శాసనసభ రద్దు చేయుటకు వీలుండకూడదని సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్‌గారు సవరణను సూచించిరి.

"ప్రజా హక్కుల" నిబంధనలో మొదటిభాగములో ప్రజలందరికీ ఉద్యోగ విషయములో సమానహక్కు లుండునని నిబంధింపబడినది. అనగా ఇండియా అంతటికీ ఒకే పౌరస్వత్వ ముండునని నిర్ణయింపబడినదన్నమాట. రెండవ భాగములో మతముగాని, కులముగాని, లింగభేదము గాని ఉద్యోగార్హతకడ్డురాదని నిబంధింపబడినది. ఈ రెండూ సామాన్య ప్రతిపాదనలకు మిగతా రెండుభాగములు సవరణలవంటివి. కొన్ని ఉద్యోగముల విషయములో, ఆయా రాష్ట్రములలో నివాసుడైననే తప్ప ఉద్యోగము లివ్వబడుటకు రాష్ట్ర ప్రభుత్వమునకు వీలులేకపోవచ్చునని, కనుక తన సవరణ ఒక క్రొత్తదృక్పథమునుండి ప్రవేశపెట్టబడినదనీ సర్ అల్లాడి అన్నాడు. నివాసమును గూర్చి నిబంధించు అధికారమును రాష్ట్రప్రభుత్వముల యిష్టమునకు వదలివేయుటకంటె, ఇది ప్రాథమిక హక్కులకు చెందిన విషయము. గనుక దీనిపై నిర్ణయముజరిపి శాసనము చేయు అధికారము కేంద్రశాసన సభకే ఉండుట ఉచితమని కూడ సర్ అల్లాడి అన్నారు.

ఉద్యోగములకు దరఖాస్తుపెట్టుకొనుటలోను, పొందుటలోను మాత్రమే గాక పొందిన తర్వాతగూడ అన్యక్తిపై ఎట్టిపక్షపాత విభేదములు చూపరాదని అనంతశయనం అయ్యంగార్ మరొక సవరణను ప్రతిపాదించెను.

వెనుకపడిన జాతులకు ఉద్యోగములు కేటాయింపబడవలెనను క్లాజు సరద్దు చేయవలసినదని సేఠ్ బాహాదర్‌స్వరూప్ ప్రతిపాదించెను. "వెనుకపడిన" జాతుల కర్థము నిర్వచించుట కష్టమనీ, ఒకజాతి యెంతవరకూ వెనుక పడినదో నిర్ణయించుటకూడ కష్టమనీ, ఇట్టి క్లాజువలన పక్షపాతములు పెరుగుననీ, అవి ఇండియావంటి మతాతీత దేశములో ఉండవలసినవికావనీ సేఠ్‌జీ వాదించెను. వారికి విద్యా సౌకర్యములు, యితర అభివృద్ధి సౌకర్యము లిచ్చుటకు తన అభ్యంతర మేమీ లేదనీ కాని ఉద్యోగార్హతను పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారి నిర్ణయముల ప్రకారము ఎంచవలెననీ ఆయన అన్నాడు.

ఉద్యోగాల ప్రత్యేకింపుపద్ధతి 10ఏళ్ల వరకే ఉండాలి

అనంతరం పండిత హృదయనాథకుంజ్రూగారు 'వెనుక పడిఉన్న జాతులకు ఉద్యోగాలను ప్రత్యేకించే పద్ధతి నూతన రాజ్యాంగం ఏర్పడిన తరువాత 10సం॥ల వరకు మాత్రమే ఉండవలెన'ని ఒక సవరణను ప్రతిపాదించిరి. తన వరణ ఉద్దేశ్యములు నాయన ఈ కిందిరీతిగా వివరించెను.

"ప్రస్తుతంమంచి చెడ్డలు విచారించుట లేని జాతులకు రక్షణ ఇవ్వకూడదని నేను అనను. కాని ముసాయిదాలో 'వెనుక పడిన' అన్నదానికి నిర్వచనం చేయలేదు. ఏజాతులు వెనుకపడినవిఅన్న అంశాన్ని న్యాయస్థానాల నిర్ణయానికి వదల కూడదు. కాబట్టి ఆపదాన్ని ఇప్పుడే స్పష్టంగా నిర్వచన చేయవలసి ఉన్నది. అంతేకాక వారికి ఈ ప్రత్యేక ఉద్యోగాల సౌకర్యాన్ని శాశ్వతంగా ఇవ్వ కూడదు. ఒక కాల పరిమితి ఉంటే, ప్రభుత్వం ఈ సౌకర్యం నిజంగా ఎంతవరకూ కలగచేస్తున్నది అని పరిశీలించి అమలు పరచటానికి వీలవుతుంది. ఉద్యోగాలను ప్రత్యేకించటం కన్నా, శాసనసభా స్థానాలను ప్రత్యేకించటం వెనుకపడిన జాతులకు ఎక్కువప్రయోజనకారి. అటువంటి శాసన సభాస్థానాలు కూడా ముసాయిదాలో 10 ఏళ్లే వరకే ప్రత్యేకించబడినవి.

అజీజ్ అహ్మద్ గారు వెనుకబడిన అన్నమాటను ముసాయిదాలో నుండి తొలగించి, ఉద్యోగశాఖలలో వెనుకపడిన వారందరికీ సౌకర్యం ఇవ్వవలెనన్నారు. ప్రొ॥ కె. టి. షా, అనంతశయనం, కె. ఎం. మున్షీ, నజీరుద్దీన్ అహ్మద్‌గార్లు చిల్లర సవరణలను ప్రతిపాదించిరి కాని, ఉపాధ్యక్షుడు డా॥ ముఖర్జీ వెనుకపడిన జాతుల ప్రతినిధులకు మాట్లాడే అవకాశం ఇవ్వవలెనని విజ్ఞప్తి చేశారి.

వెనుక బడిన జాతులవైఖరి

భారత దేశంలో స్థిరపడిన 30 లక్షల గూర్ఖాల తరఫున హరిబహదూర్ గురంగ్ మాట్లాడుతూ ఇక్కడ స్థిరపడిన తమంతా దేశానికే ప్రాణార్పింకటానికి సిద్ధంగా ఉన్నామనీ, తమ ఉద్యోగ క్షేమాల విషయం ప్రభుత్వం శ్రద్ధతో చూడవలెననీ అన్నారు.

రామప్రకాశ్‌గారు మాట్లాడుతూ వెనుకపడిన జాతులు అనుటకు బరులు 'షెడ్యూల్డ్ జాతులు' అనవలెననీ, ఉద్యోగాల ప్రత్యేకింపు పద్ధతి ఎంతవరకు అవసరమో అంతవరకూ ఉంచవలెననీ సూచించిరి.

చంద్రికరంగారు మాట్లాడుతూ నిజముగా నిమ్నజాతులకు మేలుకలగవలెనంటే రాజకీయ హక్కులు కూడా ఉండవలెననీ, ఉద్యోగాల ప్రత్యేకింపుతో పాటు శాసన సభాస్థానాల ప్రత్యేంపు కూడా ఉంచవలెననీ, అన్నారు. అయితే ఈ ముసాయిదాలో నిమ్నజాతులకు ఆత్యంతికమైన మేలు చేసే అంశం కుల, మత, వర్గ విభేదంలేకుండా అందరికీ సమాన రాజకీయ, ఆర్థిక అవకాశాలు ఇచ్చేదని ఆయన అన్నాడు.

మునుస్వామి పిళ్లైగారు 'షెడ్యూల్డ్' జాతులకు ప్రత్యేక సౌకర్యాలను ఇచ్చి ఉదారంగా ప్రవర్తించవలెననీ, చిరకాలం అటంకాలకు లోనై ఉన్నవారికి ప్రత్యేక సౌకర్యాలు ఒక ఆవశ్యకత అనీ అన్నారు. టి. చెన్నయ్యగారు ఇదే విధముగా మాట్లాడిరి. హెచ్. జె. ఖరడేకర్‌గారు మాట్లాడుతూ నిమ్నజాతుల ఉద్యోగాల అర్హతలను తగ్గించవలెనని అన్నారు.

ఇస్మాయిల్‌గారి వాదం

మహమ్మద్ ఇస్మాయిల్‌గారు ఈ విధంగా ప్రసంగించిరి: "వెనుకపడిన జాతులకింద సవర్ణ హిందువులలో జాతులు కూడా వస్తున్నవి. నిజంగా వెనుకపడి ఉన్న ముస్లిములు, క్రైస్తవులు, నిమ్నజాతులకు ప్రభుత్వం తగిన ఏర్పాటు చేయవలెను. అల్పసంఖ్యాకుల హక్కులను నిర్వచించే అంశంలో ఉద్యోగాల ప్రత్యేకింపు పద్ధతి ఉదహరించబడలేదు. ప్రాథమిక హక్కులలో దీనినికూడా చేర్చవలెను. ఈ ప్రత్యేకింపు పద్ధతి అవసరమున్నంతవరకూ అమలులోనే ఉండవలెను."

సర్దార్ హుకుంసింగ్‌గారు 'ఈ వెనుకపడిన జాతులు 296 అంశములో చెప్పబడిన అల్పసంఖ్యాకులలో జేరెదరో లేదో స్పష్టపరచవలెనని కోరిరి.

మున్షీగారి సమర్థింపు

కె. ఎం. మున్షీగారు ముసాయిదా అంశమును సమర్థిస్తూ విమర్శలకు జవాబిచ్చిరి:

"వెనుకపడిన జాతులు అన్నమాటను ఉపయోగించుటవల్ల షెడ్యూల్డ్ జాతుల హక్కులు భంగపడునని కొందరు వెలిబుచ్చిన భయము నిరాధారమైనది. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించటకీ ముసాయిదా రచనా సంఘపు ఆశయమని ఎవ్వరూ మరచిపోకూడదు. ఈ అంశంలో చేర్చబడిన రెండుక్లాజులు ప్రభుత్వశాఖలు సామర్థ్యంతో నిర్వహించునట్లు చేయుట, దేశంలో కొన్ని ప్రాంతాలలో గల ప్రత్యేక పరిస్థితులకు తగినట్లు నడచుట, అనే ఉద్దేశాలతో చేయబడినవి. ఎవరు వెనుకపడిన జాతులు, ఎవరు కారు అని నిర్ణయించుటకు త్వరలోనే ఒక పరిశీలన సంఘం నియమించబడును."

ఈ ముసాయిదాలో అడుగడుగునకూ న్యాయస్థానమునకు ఈ జేబు పందిగ్గాంశాలు చాలా ఉన్నవని టి. టి. కృష్ణమాచారిగారు విమర్శించిరి. ఆ అంశంలో 'వెనుకపడిన జాతులు' చెప్పబడినవేవని 'వెనుకపడిన తెగలు' చెప్పబడలేదనీ, ఇదితప్పక కోర్టులకు కక్షలు అంశమేననీ, ఇంకా సవరణలు చేర్చదానిని మరింత చిక్కుపరచకద్దని ఆయన అన్నాడు. ముసాయిదాను తయారుచేసిన న్యాయవాదులు తమకు కావలసినంత పని దొరికేట్లుగా దానిని తయారుచేసిరని ఆయన అన్నాడు.

అంబేద్కరు జవాబు

చర్చకు డా॥ అంబేద్కరు ఈకింది సమాధాన మిచ్చెను:

"ముసాయిదా న్యాయవాదులకు పని కల్పిస్తుందన్న ఆరోపణ యదార్థంకాదు. వ్యక్తుల నివాసస్థలములను (రెసిడెన్షియల్) గురించిన క్లాజులో ఉద్దేశ్యం, వివిధ రాష్ట్రాలలోనూ రాష్ట్రేతర భారతీయులకు ఉద్యోగాలిచ్చేవిషయమై ఆరాష్ట్రాల ప్రభుత్వాలు విధిస్తున్న 'డామిసైల్' నిబంధనలనూ, కనీసం కొంతకాలం ఆ ప్రాంతంలో నివసించి వుండవలెనని చేసే నిబంధనలనూ సమన్వయించి, దేశానికంతటికీ ఒకేపద్ధతిని ప్రవేశపెట్టుట.

వెనుకపడిన జాతులవిషయమై మూడు అభిప్రాయా లున్నవి. కొందరు అందరికీ సర్వసమానావకాశాలు వుండవలెను కనుక ప్రత్యేకింపుల పద్ధతే ఉండకూడదంటున్నారు. మరికొందరు అర్హతకలిగిన పౌరులందరినీ సమానంగానే చూడవలెనంటున్నారు. మరికొందరు వెనుకపడిన జాతులను ముందుకు తీసుకొనివచ్చినతరువాతనే సర్వసమానావకాశ సిద్ధాంతం ఆచరణలో పెట్టవలెనంటున్నారు. ఈ మూడు వైఖరులనూ సమన్వయించేదే ఈ అంశం.

అల్పసంఖ్యాకుల విషయమై ముసాయిదా ఆక్షేపచేయలేదు. అందువల్లనే 'వెనుకపడిన' జాతు లెవరో నిర్ణయించే అధికారం స్థానికప్రభుత్వానికి వదలబడినది. స్థానికప్రభుత్వం సక్రమంగా చేయకపోతే న్యాయస్థానాలు తీర్పు నివ్వగలవు.".

మున్షీ, అల్లాడి కృష్ణస్వామి, అనంతశయనంగార్ల ప్రతిపాదనలు ఆమోదించబడినవి.

బిరుదులు

అనంతరం బిరుదులకు సంబంధించిన అంశం చర్చించబడినది. అది ఈ విధంగా వున్నది. "భారతప్రభుత్వం ఎవ్వరికీ బిరుదుల నివ్వదు. భారతీయ పౌరుడెవ్వరూ విదేశాలదగ్గరనుండి బిరుదులను స్వీకరించకూడదు. ప్రభుత్వోద్యోగులు, అధ్యక్షుని అనుమతిలేనిదే విదేశాల బహుమతులను, బిరుదులను, ఉద్యోగాలను స్వీకరించకూడదు."

వెనుక ఇచ్చిన బిరుదులనుకూడా ప్రభుత్వం గుర్తించరాదని లోకనాథమిశ్రగారు సూచించిరి. సైనిక, విద్యావిషయిక బిరుదులకు ఈ అంశం అన్వయించకూడదని టి. టి. కృష్ణమాచారిగారు చేసిన సవరణ ఆమోదించబడెను. మిగిలిన సవరణలపై వోటు జరగకముందే సభ వాయిదా పడెను.

పారిశ్రామికులకు రాజాజీ హితవు

1-వ పేజీ తరువాయి)

వారి బాధ్యతలను వారు గుర్తించి, సద్బుద్ధితో ప్రవర్తింపలేరు.

"ప్రభుత్వముగాని, మీరు కాని ప్రతివిషయమూ ప్రజలకు నచ్చ చెప్పుకొనవలసి యున్నది. లేకున్న మీకుగాని, ప్రభుత్వమునకు గాని ఈ ప్రజాస్వామికమున సంపూర్ణమైన భద్రత లేదు.

మహిళలకు రాజాజీ సలహా

కలకత్తా, నవంబరు 30: 'పురుషులతో పాటు, హక్కులు కావలెనని మీరుకోరుట సమంజసమేయై యున్నది. అని లభించుటయూ దుర్లభముగాదు. కాని హక్కులతో పాటు బాధ్యతలు కూడ సంక్రమింపగలవని గ్రహింపగోరుచున్నాను' అని రాజాజీ కలకత్తా మహిళాసమాజము లూపగిన సంయుక్త సన్మానమునకు సమాధానమొసంగుచూ మహిళలకు సలహా నొసంగిరి.

రాజాజీకిన్యాయశాస్త్రి గౌరవపట్టం

కలకత్తా, నవంబర్ 30: కలకత్తా విశ్వవిద్యాలయమువారు, ప్రత్యేకముగా నేర్పాటుచేసిన స్నాతకోత్సవమునందు శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచారిగారికి 'న్యాయశాస్త్రి' అనుం డాక్టరేట్ పట్టము బహూకరించి గౌరవించిరి. ఆ గౌరవపట్టమును గవర్నర్ కె. యన్. కట్జూగారు రాజాజీకి సమర్పించిరి.

కట్జూగారి స్నాతకోపన్యాసం:—"న్యాయధర్మములు పరిరక్షకుడుగా భారతదేశము మీయందు విశ్వాసము గలిగియున్నది. మీకు అట్టి స్థానము నొసంగియున్నది. ఆ కారణముచేత న్యాయశాస్త్రమందు మీకి గౌరవము నొసంగుట యెంతయూ బప్పియున్నది. భారతీయ సంస్కృతియందు న్యాయశాస్త్రము ఉదాత్తమైన జ్వల రూపమున ప్రకాశించుచున్నది. నేటి భారతకేతన చిహ్నమైన చక్రము ఆ ప్రాక్తన న్యాయమునకూ, నాగరకతకూ ప్రతిచిహ్నమై యున్నది.

తరువాత బెంగాలు ప్రధాని బి. సి. రాయ్‌గారు రాజాజీ భారతజాతి కొనరించిన సేవను ఉద్గడించిరి. ఈ బహూకృతికి సమాధానమిచ్చుచూ రాజాజీ ఇట్లు చెప్పిరి: "సాధారణముగా ఇట్టి బిరుదులు ప్రాజ్ఞులైన వదేశోపకృతులకు విశ్వవిద్యాలయము లొసంగుట ఆచారమైయున్నది. 'న్యాయ'మన్నా 'ధర్మ'మన్నా ఒక్కటే. ధర్మమనునది ఇంకనూ అర్థస్ఫురణగలదిగనుట. నా సేవను ఉద్గడించి మీరు నాకీ పట్టప్రదానము గావించి ఎందుకు నిజముగా నేను గర్వపడవలసినదే. కాని ఇంచుక మతి చాందసము గలవాడను గనుక, తను గౌరవమును పొందదగిన సేవ నాచరించుటకువలయునో బలమును నాకు ప్రసాదించిన భగవంతునకు వందనము లర్పించుచున్నాను.

విజయవాడ రేడియో

డిశంబరు 2 గురువారం

విజయవాడ (357.1) మీటర్లు

7 గ. సుప్రభాతం. 7-10 తె. వార్తలు. 7-20 భువనరాజు గీతములు, బందా కనకలింగేశ్వరరావు, 7-30 ఖండవల్లి జనార్దనాచార్యులు, వీణ. 8 ఇంవార్తలు 8-15 నేదునూరు కృష్ణమూర్తి, 5-30 గం. నేదునూరు కృష్ణమూర్తి, 6 ఇ. వార్తలు. 6-10 స్థానికవార్తలు. 6-20 బందా కనకలింగేశ్వరరావు భావగీతాలు. 6-30 అభినందన: ఇతర కేంద్రాలనుండి సంగీతం. 7-15 తె. వార్తలు. 7-30 రేడియోద్వారా విద్య శ్రీ అ. కాశేశ్వరరావుగారి ప్రసంగం. 7-45 టీ కప్పులో తుపాను: (1) ఇల్లాలితో ఏకాంతములు: మునిమాణిక్యం నరసింగరావుగారి ప్రసంగం. 8 గ. కదేకాంత—కె. సి. వెంకట్రావుగారి నాటకం. 8-15 రాగసుధా, విజయవాడ రేడియో ఆర్కెస్ట్రా, 8-30 కల్పలత—శ్రోతలు కోరిన రికార్డులు. 9 ఇ. వార్తలు. 9-15 కవి కావ్యము, శతావధాని చల్లపిళ్ళ వెంకటశాస్త్రిగారు. 9-30 ఖండవల్లి జనార్దనాచార్యులు. వీణ.

మదరాసు రేడియో

మదరాసు (2)

7. గం. స్వాగతం. 7-20 టి. లక్ష్మీనారాయణయ్యరు పాట. 7-30 ఎం. మణ్ముగసుందరం, పాట. 8-15 రికార్డులు. 8-30 టి. కె. రామమూర్తి, ఫిడేలు. 1 గ. మహిళామండలి పిల్లల పెంపకం మాంటుశరాయి విధానము. పాపల శ్రేయస్సు బాధ్యత, ప్రసంగము. వీరేశలింగంగారి "కేరళం" సత్యరాజు చరిత్రపై వ్యాఖ్య. 2-15 హైస్కూళ్లకు తెలుగులో సుబ్రహ్మణ్యకవిగూర్చి ప్రసంగం, ఎం. వెంకట్రావుగారు, గేయసాహిత్యం. 5-30 వి. మాణిక్యం, నాగస్వరం. 6-30 గ్రామస్థులకు నారింజతోటల సేద్యము, అనుపానాలు, చర్చ డాక్టరుగారితో సంభాషణ బోధబీవర నివారణ. విశేషం లేమిటి. 7-45 భారతీయ స్వతంత్రత స్వరూపం. డా॥ పట్టాభిగారి ప్రసంగం. 8-15 కె. ఎస్. రామనారాయణయ్యరుపాట. 9-15 సర్ ఎస్. వి. రామమూర్తిగారు దేశీయ సంస్థానముల పునరుద్ధరణగూర్చి ఇంగ్లీషు ప్రసంగం. 9-40 ఎ. ఆర్. కన్నయపాట. ఇతర వేళల రికార్డులు.

మదరాసు ధరలు

మదరాసు, డిసంబరు 1:

బంగారు-వెండి నేటి మధ్యాహ్నం 1 గంటకు సవరను 1-కి ఎవ్వర్డు బొమ్మ సేల్సుటాక్సుతో సహా రు 75 8.0 పెట్లా బంగారు తులం 113 12.0 మూసబంగారు 111 12 0 సిమవెండి తులం 100-కి (రెడి) 179 0.0 వెండి తులం 1 13-0.

పంచదార

"కాన్పూరు" (2 అందరు)	రు. 105-8-9 106-8-9
బూరా (25 పౌన్లు)	రు. 11-4-0
కలకండ (25 పౌన్లు)	రు. 15-0-0

న్యూయార్కు దూది

న్యూయార్కు, నవంబరు 30:

డిశంబరు 32.22/32.22 మార్చి 32.23/32.25 మే 32.03/32.03 జూలై 31.23/31 24 అక్టోబర్ 28.68/28.68 డిశంబరు 28.47/నా. మార్చి 28.25/28.25 మే 28.00/నా.

మిడ్లింగ్ హోజరు	32.71
డిశంబరు (కర్నూలు)	32 25
,, (మధ్య)	31.95

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా

ప్రెస్ నోటు

రిజర్వుబ్యాంకు ఆఫ్ యిండియా వాటాదారులకు తెలియపరచునదేమనగా, 1948 రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా రూల్సు (పబ్లిక్ ఓనర్‌షిప్పుకు ట్రాన్సఫర్) ప్రకారము, నిర్ణీతమైన దరఖాస్తు ఫారం పూర్తిచేసి దానితోపాటు షేర్ సర్టిఫికెటు స్వాధీన పరచినయెడల ప్రామిసరీ నోట్లు చెక్కుల రూపములో పరిహారము చెల్లించబడును. వాటాదారులు యీ ఫారములను ఆఫీసులలోనుండి 6-12-1948 నుండి తీసుకొనవచ్చును. ఫారములు వెనుక ప్రక్కముద్రింపబడి యున్న సూచనల ప్రకారము వాటిని వారు పూర్తి చేయవలసినదిగా కోరబడుచున్నారు. సక్రమముగా ఫారములను పూర్తిచేసి, వాటికి సంబంధించిన షేర్ సర్టిఫికెట్లతో పైన తెలిపిన తేదీలకంటే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా తాలూకు సరియైన ఆఫీసులో దాఖలు చేయవలెను. బ్యాంకువారిచే జారీ చేయబడిన డిపాజిట్ మెమోరాండం షేరుహోల్డరు తనవద్దగాని తన ఏజెంటువద్దగాని వుంచుకొని, 1-1-1949 తేదీ తరువాత దానినియిచ్చి ప్రామిసరీనోట్లు, చెక్కులు తీసుకొనవలెను.

Madras, 1st December 1948. R. M. Koppikar, MANAGER.

కావలెను

మద్రాసు కార్పొరేషన్, మద్రాసు

టీచర్ నెస్ అలవెన్సు రు 25/-

స్పెషల్ వేతనముతో రు 75-5-10-0 10-210 జీతము స్కేలుమీద తమిళ రిపోర్టరు ఉద్యోగమునకు హయ్యర్ గ్రేడులో తమిళం పార్టుహోండు, పైపురైటింగు ప్యాసయిన అభ్యర్థులనుండి 8-12-1948 తేదీలో